మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

బుధవారం WEDNESDAY 17-6-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 349 Issue: 349

17 జూన్ 2026 - బుధవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - తె. 5:45 సూర్యాస్తమయం - సా. 6:48 తిథి తదియ రా. 9:43 వరకు తరువాత చవితి సంస్కృత వారం సౌమ్య వాసరః నక్షత్రం పునర్వసు మ. 1:38 వరకు తరువాత పుష్యమి యోగం ధ్రువ రా. 8:51 వరకు కరణం తైతుల ఉ. 11:15 వరకు గరజి రా. 9:43 వరకు వర్జ్యం రా. 8:54 నుండి రా. 10:22 వరకు దుర్ముహూర్తం ఉ. 11:51 నుండి మ. 12:43 వరకు రాహుకాలం మ. 12:17 నుండి మ. 1:54 వరకు యమగండం ఉ. 7:23 నుండి ఉ. 9:01 వరకు గుళికాకాలం ఉ. 10:39 నుండి మ. 12:17 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:09 నుండి తె. 4:57 వరకు అమృత ఘడియలు ఉ. 11:28 నుండి మ. 12:53 వరకు అభిజిత్ ముహూర్తం లేదు గమనిక: "౦" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial




## టీజీ 20 బ్రాండ్ అంబాసిడర్‌గా విజయ్ దేవరకొండ

హైదరాబాద్, జూన్ 16 (ఈవార్తలు): యువ క్రికెటర్ల ప్రతిభను వెలికితీయడమే లక్ష్యంగా హెచ్‌సీఏ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న టీజీ20 లీగ్ ప్రారంభానికి రంగం సిద్ధమైంది. జూన్ 21 నుంచి మొదలుకానున్న ఈ టోర్నీకి ప్రముఖ నటుడు విజయ్ దేవరకొండ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించనున్నారు. టైటిల్ స్పాన్సర్‌గా శ్రీనిధి యూనివర్సిటీ ఎంపికయింది. లీగ్ ఆరంభానికి సమయం దగ్గరపడటంతో అభిమానులను ఆకర్షించడానికి హెచ్‌సీఏ, ఫ్రాంఛైజీలు ప్రచార కార్యక్రమాలను జోరుగా నిర్వహిస్తున్నాయి. బుధవారం తరువాయి 2 వ పేజీలో...



## జూలై 19 నుంచి బోనాలు

### గోల్కొండ బోనంతో షురూ... ఆగస్టు 10 వరకు నిర్వహణ

### ఆగస్టు 2న లష్కర్ బోనాలు.. 3న రంగం కార్యక్రమం

హైదరాబాద్, జూన్ 16 (ఈవార్తలు): బోనాల పండగకు రంగం సిద్ధం అయింది. తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీక అయిన ఈ ఆషాఢ మాస బోనాల జాతరకు సంబంధించిన తేదీలను ఉత్సవ కమిటీ ప్రతినిధులు తాజాగా వెల్లడించారు. ఈ ఏడాది ఆషాఢమాస బోనాలు.. జూలై 19వ తేదీన గోల్కొండ జగదాంబ అమ్మవారికి తొలి బోనం సమర్పించడంతో ఈ ఉత్సవాలు అధికారికంగా మొదలు కానున్నాయి. దాదాపు నెల రోజుల పాటు హైదరాబాద్ నగరం మొత్తం జరగనున్న ఈ బోనాల పండగ.. తరువాయి 2 వ పేజీలో...




## 20న పీఎం కిసాన్ నిధులు

న్యూఢిల్లీ: రైతన్నలకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. రైతాంగానికి పెట్టుబడి సాయంగా అందిస్తున్న 'ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి' 23వ విడత నిధులను ఈ నెల జూన్ 20న ఖాతాల్లోకి నిధులను నేరుగా విడుదల చేయబోతున్నట్లుగా ప్రకటించింది. దీంతో దేశవ్యాప్తంగా ఉన్న 9 కోట్లకు పైగా రైతులకు లబ్ధి చేకూరనుంది. పీఎం కిసాన్ లబ్ధిదారులందరికీ డబ్బులు జమ కావాలంటే ఈ-కేవైసీ పూర్తి చేయడం తప్పనిసరి అని అధికారులు స్పష్టం చేశారు. బ్యాంక్ ఖాతాకు ఆధార్ లింక్ కాకపోయినా, కేవైసీ ప్రక్రియ పెండింగ్‌లో ఉన్నా నిధులు నిలిచిపోయే ప్రమాదం ఉంది. ఈ-కేవైసీ పూర్తి చేయని రైతులు వెంటనే పీఎం కిసాన్ అధికారిక వెబ్‌సైట్ ద్వారా లేదా సమీపంలోని మీసేవా, సీఎస్సీ కేంద్రాలకు వెళ్లి తమ వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు.



# నిరుద్యోగుల మెరుపు ధర్నా

హైదరాబాద్‌లోని ప్రముఖ కోచింగ్ హబ్ దిల్‌సుఖ్‌నగర్ మరోసారి నిరుద్యోగుల, పోలీస్ ఉద్యోగార్థుల ఆందోళనలతో దద్దరిల్లింది. పోలీస్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియపై రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరికి నిరసనగా మంగళవారం వందల మంది అభ్యర్థులు అకస్మాత్తుగా దిల్‌సుఖ్‌నగర్ ప్రధాన చౌరస్తాలోకి దూసుకొచ్చి, మెరుపు ధర్నాకు దిగారు. డప్పు చప్పుళ్లతో, ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో నిరుద్యోగులు పెద్ద ఎత్తున పోరుబాట పట్టడంతో అక్కడ తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

### పోలీస్ ఉద్యోగాల భర్తీపై నిరసన.. 20 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్

### దిల్‌సుఖ్‌నగర్‌లో ఉద్రిక్తత.. పోలీసుల లాఠీ చార్జీ.. రాష్ట్ర ప్రభుత్వంపై భగ్గుమన్న ప్రతిపక్షాలు

హైదరాబాద్, జూన్ 16 (ఈవార్తలు): ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన కేవలం 5 వేల కానిస్టేబుల్ పోస్టుల భర్తీ తమను తీవ్ర నిరాశకు గురిచేసిందని, వేల సంఖ్యలో కానిస్టేబుల్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటన్నింటినీ కలిపి కనీసం 20 వేల పోస్టులతో మెగా నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి రూమ్‌లల్లో ఉంటూ, అప్పులు తెచ్చి మరీ కోచింగ్ తీసుకుంటున్న తమకు 5 వేల పోస్టులు ఏమాత్రం సరిపోవని, ఇది నిరుద్యోగులను మోసం చేయడమేనని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగులు ఒక్కసారిగా దిల్‌సుఖ్‌నగర్ ప్రధాన రహదారిపై బైఠాయించడంతో విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. మైళ్ల దూరంలో ట్రాఫిక్ స్తంభించిపోవడంతో తరువాయి 2 వ పేజీలో...



## డాక్టర్ చీటీ ఉంటేనే దగ్గు మందు

దగ్గు సిరప్‌ల విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. దగ్గు సిరప్‌లను కొనేందుకు డాక్టర్ ప్రిస్క్రిప్షన్ తప్పనిసరి అని కేంద్రం పేర్కొన్నది. ఈ నేపథ్యంలో నోటిఫికేషన్ జారీ చేసింది. 1945 నాటి డ్రగ్ రూల్స్ లోనూ సవరణలు చేశారు. తమిళనాడుకు చెందిన శ్రీసన్ కంపెనీ ఉత్పత్తి చేస్తున్న కోల్డ్రిఫ్ దగ్గు సిరప్ తాగి సుమారు 20 మంది చిన్నారులు మృతిచెందారు. అయితే ఆ ఘటన పట్ల ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది.

న్యూఢిల్లీ: భారత్ తయారీకి చెందిన దగ్గు మందుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డబ్ల్యూహెచ్‌వో తన హెచ్చరికల్లో పేర్కొన్న విషయం తెలిసిందే. 2026 డ్రగ్స్ రూల్స్‌ను కేంద్రం నోటిఫై చేసింది. పాత చట్టానికి సవరణలు చేశారు. షెడ్యూల్ కేలో భాగంగా సిరప్ పదాన్ని ఆ కేటగిరీ నుంచి తొలగించారు. డ్రగ్స్ యాక్ట్ 1940 ప్రకారం ఆ కేటగిరీలో కొన్ని మందుల తయారీ, సరఫరా, అమ్మకాలపై నిషేధం మినహాయింపు ఇస్తారు. షెడ్యూల్ తరువాయి 2 వ పేజీలో...




2

## నీట్ ఎఫెక్ట్.. టెలిగ్రామ్‌పై నిషేధం

నీట్-యూజీ 2026 రీ-ఎగ్జాంకు ముందు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పరీక్షల్లో అక్రమాలు, ప్రశ్నాపత్రం లీక్‌ల పేరుతో జరుగుతున్న మోసాలు, తప్పుడు ప్రచారాలను అరికట్టేందుకు మెసేజింగ్ యాప్ టెలిగ్రామ్‌పై తాత్కాలిక ఆంక్షలు విధించింది.




బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,137 |
| వెండి (కిలో): | రూ.2,75,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,248 |

## లాగిన్ టైంలోనే మోసాలు

### అథెంటికేషన్‌లో లోపాలు.. రెట్టింపైన డిజిటల్ ఫ్రాడ్స్

### భారత్‌లోనే అత్యధికం.. ట్రాన్స్ యూనియన్ నివేదిక




న్యూఢిల్లీ : దేశంలో డిజిటల్ లావాదేవీలు ఏటా రికార్డు స్థాయిలో విస్తరిస్తున్నప్పటికీ అదే వేగంతో సైబర్ నేరగాళ్లు కూడా విరుచుకుపడుతున్నారు. అంతర్జాతీయ క్రెడిట్ బ్యూరో సంస్థ ట్రాన్స్‌యూనియన్ విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం.. ప్రపంచ సగటుతో పోలిస్తే భారత్‌లో డిజిటల్ మోసాల ముప్పు దాదాపు రెట్టింపు స్థాయిలో పొంచి ఉంది. గడిచిన ఏడాదిలో ప్రపంచవ్యాప్తంగా జరిగిన డిజిటల్ లావాదేవీలలో అనుమానాస్పద మోసాల సగటు 3.8 శాతంగా నమోదైతే.. భారత్‌లో ఈ రేటు ఏకంగా 7.1 శాతానికి చేరి ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా వేగవంతమైన వృద్ధిని కనబరుస్తున్న లాజిస్టిక్స్, టెలికాం, మరియు ఇన్సూరెన్స్ రంగాలు ఈ సైబర్ మోసగాళ్ల ప్రధాన లక్ష్యంగా మారుతు న్నాయి. పరిశ్రమల వారీగా ఈ డేటాను పరిశీలిస్తే.. కొరియర్, రవాణా సేవలు అందించే తరువాయి 2 వ పేజీలో...



## మోదీ-ట్రంప్ షేక్ హ్యాండ్!

### జీ7 సదస్సులో కలిసిన దేశాధినేతలు

నీస్: ఫ్రాన్స్ వేదికగా జరుగుతున్న జీ7 సదస్సులో భాగంగా.. ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కలుసుకున్నారు. ఇద్దరూ కరచాలనం చేసుకుని, సదస్సులో పక్కపక్కనే కూర్చుకున్నారు. గత ఏడాది ఫిబ్రవరి తర్వాత వీరిద్దరూ ప్రత్యక్షంగా పలకరించుకోవడం ఇదే మొదటిసారి. బుధవారం వీరిద్దరు సమావేశం కానున్నారు. అంతకుముందు జీ7 సదస్సు వేదిక వద్ద మోదీకి ఫ్రాన్స్ అధ్యక్షుడు తరువాయి 2 వ పేజీలో...



## విశ్వవాణి

అమెరికాలోని బాల్టిమోర్‌కు చెందిన డాక్టర్ మైఖేల్ జోలికోఫర్ దాదాపు 40 ఏళ్ల పాటు అనేక కుటుంబాలకు ఉచితంగా వైద్య సేవలు అందించారు. అయితే, ఆయనకు ఒకేసారి రెండు రకాల క్యాన్సర్లు నిర్ధారణ అయ్యాయి. డాక్యుమెంట్లలో సమస్య వల్ల ఆయనకు హెల్త్ ఇన్సూరెన్స్ రాలేదు. విషయం తెలిసిన ప్రజలు.. గోఫండ్‌మీ ద్వారా ఏకంగా 2.5 లక్షల డాలర్ల విరాళాలు సేకరించి, వైద్య ఖర్చులకు అందజేశారు.



## ఎయిరిండియా టికెట్లు చౌక

విమాన ప్రయాణికులకు ఎయిరిండియా సంస్థ తీపి కబురు అందించింది. విమాన ప్రయాణంలో భోజనం అవసరం లేదనుకునే వారి కోసం తక్కువ ధరకే టికెట్లను ఆఫర్ చేస్తూ సరికొత్త 'బేసిక్' ఫేర్ కేటగిరీని ప్రవేశపెట్టింది. దీంతో ప్రయాణికులు సాధారణ ఎకానమీ క్లాస్ టికెట్ ధర కంటే తక్కువ ఖర్చుతోనే తమ గమ్యస్థానాలకు చేరుకోవచ్చు.

# నరహరి.. కాదు బకాసురుడు!

### రూ.200 కోట్ల అక్రమాస్తులు.. కిలోల కొద్దీ బంగారం, వెండి

### లగ్జరీ ప్లాట్లు, వ్యవసాయ భూములు.. లంచాల ల్యాండ్స్ అండ్ సర్వే డీడీ

హైదరాబాద్, జూన్ 16 (ఈవార్తలు): తెలంగాణలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) మరోసారి పంజా విసిరింది. ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణలపై సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరి నివాసం, కార్యాలయాల్లో ఏసీబీ అధికారులు మంగళవారం సోదాలు తరువాయి 2 వ పేజీలో...



## పెట్టుబడులకు ఇదే రైట్ టైమ్ పీయుష్ గోయల్

పెట్టుబడులకు ఇదే సరైన సమయమని, ఆలస్యం చేయకుండా దేశీయ పెట్టుబడిదారులు, కార్పొరేట్ సంస్థలు, వెంచర్ క్యాపిటల్ ఫండ్‌లు స్టార్టప్‌లు, కొత్త ఆవిష్కరణలపై పెట్టుబడులు పెంచాలని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ పిలుపునిచ్చారు.

2

## రాశి ఫలాలు

17.6.2026

మేషం: మిత్రులతో విందు వినోదాది కార్యక్రమాలలో పాల్గొంటారు. విలువైన వస్తు లాభాలు పొందుతారు. ఆకస్మిక ధనలాభ సూచనలున్నవి. ఇంటా బయట బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తారు. వ్యాపారాలు ఉత్సాహంగా సాగుతాయి. ఉద్యోగాలలో ఆశించిన స్థానచలన సూచనలున్నవి.

వృషభం: దూరప్రయాణాలలో వాహన ఇబ్బందులుంటాయి. ఇంటాబయట సమస్యలు చికాకు పరుస్తాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. బంధువులతో స్వల్ప వివాదాలు కలుగుతాయి. వ్యాపారాలు సాదాసీదాగా నడుస్తాయి. ఉద్యోగులు అధికారుల ఆగ్రహానికి గురవుతారు.

మిథునం: చేపట్టిన పనులలో మీ శ్రమకు తగిన ఫలితం లభిస్తుంది. దూరపు బంధువుల నుండి శుభవార్తలు అందుతాయి. చిన్ననాటి మిత్రుల సహాయంతో కొన్ని పనులు పూర్తవుతాయి. నూతన వాహన యోగం ఉన్నది. వ్యాపారాల విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఉద్యోగులకు పదోన్నతులు పెరుగుతాయి.

కర్కాటకం: సంఘంలో పరపతి పెరుగుతుంది. సన్నిహితుల నుంచి ఆర్థిక లాభాలు పొందుతారు. నిరుద్యోగ యత్నాలు సానుకూలమవుతాయి. దైవ చింతన పెరుగుతుంది. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగమున అధికారుల నుండి ప్రశంసలు పొందుతారు.

సింహం: కీలక వ్యవహారాలలో ఆలోచించి నిర్ణయాలు అమలు చెయ్యడం మంచిది. ఆర్థిక ఇబ్బందుల వలన నూతన ఋణయత్నాలు చేస్తారు. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. వ్యాపారాలు సామాన్యంగా లాభిస్తాయి. ఉద్యోగస్తుల విధుల్లో సమస్యలు తప్పవు. బంధు వర్గం వారితో విభేదాలు కలుగుతాయి.

కన్య: వృధా ప్రయాణాలు చెయ్యవలసి వస్తుంది. నూతన ఋణయత్నాలు కలసిరావు. స్థిరాస్తి ఒప్పందాలలో ఆటంకాలు తప్పవు. చేపట్టిన పనులు మధ్యలో వాయిదా పడతాయి. వ్యాపారాలు స్వల్పంగా లాభిస్తాయి. నిరుద్యోగ ప్రయత్నాలు ఫలించవు. ఉద్యోగులకు సహోద్యోగులతో మాటపట్టింపులు కలుగుతాయి.

తుల: చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. భూవివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. వృత్తి, వ్యాపారాలు మరింత అనుకూలంగా సాగుతాయి.

వృశ్చికం: సంఘంలో పెద్దల నుండి వివాదాలకు సంబంధించి ముఖ్య సమాచారం అందుతుంది. పనుల్లో మరింత పురోగతి సాధిస్తారు. మిత్రుల నుంచి వివాహ శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. వ్యాపారాలు ఆశించిన రీతిలో రాణిస్తాయి. ఉద్యోగులకు జీతభత్యాల విషయంలో సానుకూల ఫలితాలుంటాయి.

ధనస్సు: ముఖ్యమైన పనులు వాయిదా వేస్తారు. కుటుంబ సభ్యులతో మాటపట్టింపులు ఉంటాయి. వ్యాపారాలు కొంత నిరాశ కలిగిస్తాయి. ఉద్యోగులకు పనిభారం పెరుగుతుంది. ఆర్థిక ఇబ్బందుల వలన మానసిక సమస్యలు కలుగుతాయి. నిరుద్యోగులు మరింత కష్టపడాలి. వాహన కొనుగోలు ప్రయత్నాలు వాయిదా పడుతాయి.

మకరం: ఇతరులకు ధనపరంగా మాట ఇవ్వడం మంచిది కాదు. గృహమున మీ ఆలోచనలు అందరికి నచ్చవు. వ్యాపారాలు స్వల్పంగా లాభిస్తాయి. ఉద్యోగులకు పనిభారం పెరుగుతుంది. స్థిరాస్తి వ్యవహారాలలో తొందరపాటు మంచిది కాదు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

కుంభం: సన్నిహితుల నుండి కీలక విషయాలు తెలుసుకుంటారు. సంతనానికి నూతన విద్యావకాశాలు లభిస్తాయి. నూతన వ్యాపార ప్రారంభానికి పెట్టుబడులు అందుతాయి. ఉద్యోగ విషయంలో సమస్యలు అదిగమించి ముందుకు సాగుతారు.ఆర్థిక పరంగా ఇబ్బందులు తొలగుతాయి.

మీనం: ఆర్థిక లావాదేవీలు నిరాశ కలిగిస్తాయి. నూతన కార్యక్రమాల ప్రారంభానికి అవరోధాలు కలుగుతాయి. కుటుంబ సభ్యులతో ఆలయ దర్శనాలు చేసుకుంటారు. వ్యాపారాలలో భాగస్తులతో చిన్నపాటి వివాదాలు కలుగుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు మందకొడిగా సాగుతాయి.

# మెరుపు ధర్నా

మొదటి పేజీ తరువాయి

రంగంలోకి దిగిన పోలీసులు ఆందోళనకారులను చెదరగొట్టేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో పోలీసులకు, నిరుద్యోగులకు మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగింది. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తమపై పోలీసులు దాడికి దిగారని అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టుదలతో కూర్చున్న పలువురు నిరసనకారులను పోలీసులు బలవంతంగా రోడ్డుపై ఈడ్చుకెళ్లి, పోలీస్ వాహనాల్లో ఎక్కించి చైతన్యపురి పోలీస్ స్టేషన్‌తో పాటు పరిసర ప్రాంత స్టేషన్లకు తరలించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఉపాధి కల్పనకు ప్రథమ ప్రాధాన్యతనిస్తూ 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని ఇచ్చిన హామీని ఇప్పటికీ పూర్తిస్థాయిలో నెరవేర్చకపోవడంపై నిరుద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చిన మాట ప్రకారం జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, ఖాళీల సంఖ్యను భారీగా పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ డిమాండ్లపై సానుకూలంగా స్పందించకపోతే ఈ ఉద్యమాన్ని కేవలం హైదరాబాద్‌కే పరిమితం చేయకుండా, రాష్ట్రవ్యాప్తంగా ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరుద్యోగుల ఈ ఆందోళన కేవలం దిల్‌సుఖ్‌నగర్‌కే పరిమితం కాలేదు. ఇప్పటికే ఉస్మానియా యూనివర్సిటీలోనూ విద్యార్థులు, నిరుద్యోగ జేఏసీ నాయకులు భారీ ర్యాలీలు చేపట్టి, ధర్నాలు నిర్వహించారు. అశోక్ నగర్ లైబ్రరీ ప్రాంతానికి చెందిన నిరుద్యోగులు కూడా ఆందోళనకు దిగడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. విద్యార్థి లోకం, నిరుద్యోగులు అంతా ఏకతాటిపైకి వస్తున్నారని, ప్రభుత్వం ఇప్పటికైనా పట్టుదలకు పోకుండా కానిస్టేబుల్ పోస్టుల సంఖ్యను పెంచుతూ తక్షణమే సవరించిన ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. నిరుద్యోగుల అరెస్టుల నేపథ్యంలో దిల్‌సుఖ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో పోలీసులు అదనపు బలగాలను మోహరించి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

నిరుద్యోగులను అణగదొక్కడమే ప్రజా పాలననా?: కేటీఆర్

దిల్‌సుఖ్‌నగర్ లో తమ న్యాయమైన డిమాండ్ల కోసం, ఉద్యోగాల భర్తీ కోసం శాంతియుతంగా ఆందోళన చేస్తున్న నిరుద్యోగ యువతపై, పోలీస్ అభ్యర్థులపై ప్రభుత్వం పోలీసులను ప్రయోగించి లాఠీఛార్జ్ చేయించడాన్ని కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలుపుతున్న అభ్యర్థులను వీధుల వెంట వెంటాడి వేటాడటం, అక్రమంగా అరెస్ట్ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ అహంకారానికి, నిరంకుశత్వానికి నిదర్శనమని ఆయన మండిపడ్డారు. విద్యార్థులను, నిరుద్యోగులను పోలీసులతో అణగదొక్కడమే కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన ఇందిరమ్మ ప్రజా పాలననా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఇప్పటికే హైదరాబాద్‌తోపాటు అన్ని యూనివర్సిటీల్లో విద్యార్థులు ఉద్యోగుల భర్తీ కోసం నోటిఫికేషన్లు జారీ చేయాలని అనేక రోజులుగా పలు రకాల నిరసన కార్యక్రమాలు చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికల ముందు ఒకే ఏడాది రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, 'మెగా నోటిఫికేషన్లు', 'జాబ్ క్యాలెండర్' అంటూ కోతలు కోసి, నిరుద్యోగ యువతను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, నేడు నిరుద్యోగుల నోట్లో మట్టి కొడుతోందని కేటీఆర్ ధ్వజమెత్తారు. రాష్ట్రంలో 20 వేలకి పైగా పోలీస్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నప్పటికీ, కేవలం 5 వేల పోస్టులతో చేతులు దులుపుకోవాలని చూడటం అన్యాయమన్నారు. సుదీర్ఘకాలంగా కోచింగ్ సెంటర్లలో శిక్షణ తీసుకుంటూ, ఆర్థిక ఇబ్బందులు పడుతున్న అభ్యర్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నట్టుగా వెంటనే 20,000 పోలీస్ కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేస్తూ మెగా నోటిఫికేషన్ విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# జూలై 19 నుంచి బోనాలు

మొదటి పేజీ తరువాయి

ఆగస్ట్ 10వ తేదీ వరకు అంగరంగ వైభవంగా కొనసాగుతాయని తెలిపారు. ఆషాఢ మాసం ప్రారంభాన్ని పురస్కరించుకుని జూలై 19వ తేదీన చారిత్రక గోల్కొండ కోటలో జగదాంబ అమ్మవారికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు, తొలి బోనం సమర్పించనున్నారు. ఇక అదే రోజున హైదరాబాద్ నగరంలోని పలు ప్రధాన ఆలయాల్లో ఘటాల ఊరేగింపు అంగరంగ వైభవంగా, అత్యంత భక్తిశ్రద్ధలతో పలు కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. అప్పటి నుంచి ప్రతీ ఆదివారం, గురువారాల్లో అమ్మవారికి నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రత్యేక పూజలు, బోనాలు సమర్పించనున్నారు. ఈ బోనాల ఉత్సవాల్లో అతి కీలక ఘట్టాలు ఆగస్ట్ తొలి వారంలో జరగనున్నాయి. ఆగస్ట్ 2వ తేదీ ఆదివారం రోజున లష్కర్ (సికింద్రాబాద్) ఉజ్జయిని మహంకాళి అమ్మవారితోపాటు ప్రధాన ఆలయాల్లో అమ్మవారికి భక్తులు భారీ ఎత్తున బోనాలను సమర్పించనున్నారు. ఆగస్ట్ 3వ తేదీ సోమవారం రోజున సికింద్రాబాద్ మహంకాళి ఆలయంలో పవిత్ర రంగం (భవిష్యవాణి) కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆ తర్వాత అంబారీపై అమ్మవారిని సాగనంపే ఊరేగింపు కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా చేపట్టనున్నారు. గోల్కొండ జగదాంబ అమ్మవారికి తొలి బోనంతో ప్రారంభం కానున్న ఈ బోనాల జాతర.. ఆ తర్వాత లాల్ దర్వాజా సింహవాహిని అమ్మవారు.. పాతబస్తీలోని ఉమ్మడి దేవాలయాల ఉత్సవాలతో ముగియనుంది. ఆగస్ట్ 10వ తేదీన ఉమ్మడి దేవాలయాల ఘటాల సామూహిక ఊరేగింపు.. గజరాజుపై అమ్మవారి శోభాయాత్రతో ఈ సంవత్సరం ఆషాఢ బోనాల జాతర ముగియనుంది. ఇక రాష్ట్ర పండగ అయిన ఈ బోనాల పండుగను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించేందుకు తెలంగాణ సర్కార్ ఇప్పటికే ముందస్తు ఏర్పాట్లు చేస్తోంది. నగరంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జీహెచ్ఎంసీ, జలమండలి, పోలీస్, విద్యుత్ సహా అన్ని శాఖల సమన్వయంతో ప్రత్యేక ఏర్పాట్లు, భారీ బందోబస్తును ఏర్పాటు చేయనున్నారు.

## నీట్ ఎఫెక్ట్.. టెలిగ్రామ్‌పై నిషేధం

మొదటి పేజీ తరువాయి

న్యూఢిల్లీ: 2026 జూన్ 22 వరకు దేశంలో టెలిగ్రామ్ సేవల పరిమితం చేయాలని కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ ఆదేశాలు జారీ చేసింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) చేసిన సిఫార్సుల మేరకు, సమాచార సాంకేతిక చట్టం-2000లోని సెక్షన్ 69ఏ కింద ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. జూన్ 21న జరగనున్న నీట్ రీ-ఎగ్జామ్ రోజుతో పాటు ఆ తర్వాతి రోజు వరకు ఈ పరిమితులు అమల్లో ఉంటాయి. పరీక్షలు రాసే విద్యార్థులను మోసం చేస్తున్న గ్రూపులు టెలిగ్రామ్‌ను విస్తృతంగా ఉపయోగిస్తున్నాయని, అందుకే ఈ చర్యలు చేపట్టినట్లు ఎన్‌టీఏ వెల్లడించింది. అయితే టెలిగ్రామ్‌లో ఇప్పటికే పంపిన సందేశాలను తర్వాత సవరించే సదుపాయాన్ని కూడా జూన్ 30 వరకు భారతదేశంలో నిలిపివేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది.

## టీజీ 20 బ్రాండ్ అంబాసిడర్‌గా విజయ్ దేవరకొండ

మొదటి పేజీ తరువాయి

ట్యాంక్‌బండ్‌పై ట్రోఫీ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇటీవల నెక్లెస్ రోడ్‌లో హెచ్‌సీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్రోన్ డిస్‌ప్లే షోలో జట్ల లోగోలను నిర్వాహకులు ప్రదర్శించారు. లీగ్‌లో ఎనిమిది జట్లు పోటీపడుతుండగా.. ప్రతి జట్టు మిగతా అన్ని టీమ్‌లతో ఒక్కో మ్యాచ్ ఆడనుంది. తొలి మ్యాచ్‌లో పాలమూరు స్ట్రైకర్స్, అన్విత ఖమ్మం ఏసెస్ తలపడనున్నాయి. జూన్ 23న పాలమూరుతో జరిగే మ్యాచ్‌తో హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ తలపడనుంది. మంగళవారం బేగంపేట్‌లో నిర్వహించిన కార్యక్రమానికి హెచ్‌సీఏ కార్యదర్శి జీవన్ రెడ్డి, టీజీ20 గవర్నింగ్ కౌన్సిల్ ఛైర్మన్ ఆగం రావు, హెచ్‌సీఏ, ఫ్రాంఛైజీల యాజమానులు హాజరయ్యారు. టీజీ20 గవర్నింగ్ కౌన్సిల్ ఛైర్మన్ ఆగం రావు లీగ్ వివరాలను వెల్లడించారు. విజేత జట్టుకు రూ.కోటి నగదు బహుమతి, రన్నరప్‌గా నిలిచిన జట్టుకు రూ.50 లక్షలు, మూడు, నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లను రూ.25 లక్షల చొప్పున ప్రైజ్‌మనీ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉప్పల్ స్టేడియంలో తొలి మ్యాచ్‌కు ముందు వేడుకలు ఉంటాయన్నారు. సంగీత దర్శకుడు తమన్ మ్యూజిక్ కాన్సర్ట్, లేజర్ షో ఉంటుందని పేర్కొన్నారు. ఇంపాక్ట్ ప్లేయర్ రూల్ తప్ప ఐపీఎల్‌లోని అన్ని రూల్స్ ఈ లీగ్‌లో ఉంటాయని.. డిస్ట్రిక్ యాప్‌లో టికెట్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. టికెట్ల ధరలు రూ.50, రూ.100గా నిర్ణయించామన్నారు.

## లాగిన్ టైంలోనే మోసాలు

మొదటి పేజీ తరువాయి

లాజిస్టిక్స్ రంగం 16.3 శాతం అనుమానాస్పద మోసాల రేటుతో అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానాల్లో టెలికాం రంగం 14.7 శాతంతో, బీమా రంగం 11.5 శాతంతో తీవ్రమైన ముప్పును ఎదుర్కొంటున్నాయి. ఈ నిర్దిష్ట రంగాలు వెంటవెంటనే జరిగే లావాదేవీలపై, విస్తృతమైన డిస్ట్రిబ్యూటెడ్ నెట్‌వర్క్‌లపై ఆధారపడి పనిచేస్తుండటమే సైబర్ నేరగాళ్లకు వరంగా మారుతోంది. వినియోగదారుల గుర్తింపును సరిచూసే ప్రక్రియల్లో, అథెంటికేషన్ వ్యవస్థల్లో ఉన్న సాంకేతిక లోపాలను ఆసరాగా చేసుకుని మోసగాళ్లు ఈ రంగాల ఖాతాల్లోకి సులభంగా చొరబడుతున్నారు. అయితే అంతర్జాతీయ ట్రెండ్‌తో పోలిస్తే భారత్‌లో సైబర్ నేరగాళ్లు అనుసరిస్తున్న వ్యూహం పూర్తి భిన్నంగా ఉందని ఈ నివేదిక స్పష్టం చేసింది. ప్రపంచవ్యాప్తంగా కొత్త అకౌంట్లు తెరిచేటప్పుడు మోసాలు ఎక్కువగా జరుగుతుంటే.. భారత్‌లో మాత్రం ఇప్పటికే చలామణిలో ఉన్న వినియోగదారుల ఖాతాల్లోకి లాగిన్ అయ్యే సమయంలోనే గరిష్టంగా 3.9 శాతం మోసాలు జరుగుతున్నాయి. వ్యాపార సంస్థలు, వినియోగదారులు లాగిన్ దశల్లో తమ భద్రతా వ్యవస్థలను మరింత బలోపేతం చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

## మోదీ-ట్రంప్ షేక్ హ్యాండ్!

మొదటి పేజీ తరువాయి

మెక్రాన్ స్వాగతం పలికారు. సమావేశంలో భాగంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. ఇంధనం, ఆహారం, ఆరోగ్యం, సైబర్ సెక్యూరిటీ, ఆర్థిక భద్రత వంటి రంగాలు పెనవేసుకున్న ఈ ప్రపంచంలో మానవాళి పురోగతి, శ్రేయస్సు కోసం అంతర్జాతీయ భాగస్వామ్యాలను నిర్మించడం అత్యవసరమని పేర్కొన్నారు. స్వార్థ ప్రయోజనాల కోసం వాణిజ్యం, సాంకేతికతలను దుర్వినియోగం చేస్తున్నారని, ఇది అంతర్జాతీయ వేదికపై విశ్వాసం కొరవడేందుకు దారితీస్తోందని చెప్పారు. ప్రపంచ భాగస్వామ్యాల్లో విశ్వాసం, పారదర్శకతను పెంపొందించడంపై దృష్టి పెట్టాలని దేశాలకు పిలుపునిచ్చారు. భారత్ ఎల్లప్పుడూ 'మానవత్వమే ప్రథమం' అనే సూత్రాన్ని అనుసరిస్తోందని, అంతర్జాతీయ సౌర కూటమి, గ్లోబల్ బయో-ఫ్యూయల్ అలయన్స్ వంటివాటికి ఈ ఆలోచనే కేంద్రంగా నిలిచిందన్నారు. ప్రపంచ శాంతి, స్థిరత్వం కోసం అన్ని దేశాలూ చర్చలు, దౌత్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

# నరహరి.. కాదు బకాసురుడు!

మొదటి పేజీ తరువాయి

చేపట్టారు. ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ నేతృత్వంలోని బృందాలు మంగళవారం తెల్లవారుజాము నుంచే ఏకకాలంలో ఈ తనిఖీలు ప్రారంభించాయి. హైదరాబాద్‌లోని చిత్రినాకలో ఉన్న నరహరి నివాసం, ఆయన కార్యాలయంతో పాటు ఆయనకు సంబంధం ఉన్న మరో 11 ప్రాంతాల్లో అధికారులు విస్తృతంగా సోదాలు నిర్వహించారు. అధికారులకు భారీ మొత్తంలో నగలు, నగదు, ఆస్తులకు సంబంధించిన పత్రాలు లభించాయి. నరహరి ఇంట్లో.. ఆయన బెడ్రూంలో ఉన్న బెడ్డు కింద రూ.1.10 కోట్ల నగదు ఉన్నట్లు గుర్తించారు. ఇంట్లో దొరికిన బంగారు ఆభరణాలు, డబ్బు, రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. నరహరితోపాటు ఆయన సోదరుడి ఇంట్లో భారీగా ఆస్తిపత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌లో లగ్జరీ ప్రాంతాల్లో ఓపెన్ ప్లాట్లతోపాటు.. రంగారెడ్డి జిల్లాలో వ్యవసాయ భూమి ఉన్నట్లు అధికారులు



విచారణలో వెల్లడైంది. నరహరి నివాసంలో రూ. కోటి వరకు బ్యాంక్ డిపాజిట్లు (ఎఫ్‌డీ) దొరికాయి. నరహరి పేరు మీద రెండు బ్యాంక్ లాకర్లు గుర్తించగా, వాటిని తనిఖీ చేసేందుకు అనుమతి కోసం బ్యాంకుకు లేఖ రాశారు. రెండు మూడు రోజుల్లో ఆ లాకర్లు ఓపెన్ చేస్తామని అధికారులు స్పష్టం చేశారు. అంతేకాకుండా రియల్ ఎస్టేట్ సంస్థల్లో పెట్టుబడులు పెట్టారా? లేదా? అనే విషయంపై విచారిస్తున్నామని తెలిపారు. ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ నేతృత్వంలోని స్పెషల్ టీమ్స్ ఈ సోదాలు చేపట్టాయి. ఈ క్రమంలోనే ఇప్పటివరకు దొరికిన ఆధారాల ప్రకారం.. నరహరి ఆస్తుల విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.200 కోట్లకు పైనే ఉంటుందని సమాచారం.



## డాక్టర్ చీటీ ఉంటేనే దగ్గు మందు

మొదటి పేజీ తరువాయి

కేలో ఉన్న డ్రగ్స్‌ను ఎటువంటి లైసెన్సు లేకుండానే అమ్ముకోవచ్చు. ఇంటి చిట్కాలుగా భావిస్తూ ఆస్పరిన్, పారాసిటమాల్, అనల్జసిక్ బామ్స్ లాంటి కొన్ని మందులు అమ్ముకునేందుకు వీలు ఉంది.అయితే ఇప్పుడు ఆ షెడ్యూల్ నుంచి సిరప్ అనే పదాన్ని తొలగించారు. దగ్గు కోసం వాడే సిరప్‌లు, లాజెంజెస్, పిల్స్, ట్యాబ్‌లెట్లు కూడా అందులో ఉన్నాయి. ప్రభుత్వం అధికారిక గెజిట్ ప్రచురించడం వల్ల కొత్తగా చేపట్టిన సవరణ అమలులోకి వచ్చేస్తుంది.

## ఎయిరిండియా టికెట్లు చౌక

న్యూఢిల్లీ: విమాన ప్రయాణికులకు ఎయిరిండియా సంస్థ తీపి కబురు అందించింది. విమాన ప్రయాణంలో భోజనం అవసరం లేదనుకునే వారి కోసం తక్కువ ధరకే టికెట్లను ఆఫర్ చేస్తూ సరికొత్త 'బేసిక్' ఫేర్ కేటగిరీని ప్రవేశపెట్టింది. దీంతో ప్రయాణికులు సాధారణ ఎకానమీ క్లాస్ టికెట్ ధర కంటే తక్కువ ఖర్చుతోనే తమ గమ్యస్థానాలకు చేరుకోవచ్చు. తాజాగా ఎకానమీ క్లాస్‌లో ఇప్పటికే ఉన్న వాల్యూ, క్లాసిక్, ఫ్లెక్స్ కేటగిరీలతో పాటు కొత్తగా నాలుగో కేటగిరిగా 'బేసిక్' ఆప్షన్ అందుబాటులోకి వచ్చింది. అయితే, ప్రస్తుతానికి ఈ సదుపాయాన్ని దేశీయంగా తక్కువ సమయం ప్రయాణించే కొన్ని ఎంపిక చేసిన రూట్లలో పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభించారు. ఢిల్లీ-చండీగఢ్, ఢిల్లీ-ఉదయ్‌పూర్ సహా సుమారు 15 నుంచి 20 రూట్లలో ఈ సేవలు అందుబాటులో ఉండనున్నాయి. 'బేసిక్' టికెట్ తీసుకున్న వారికి కూడా ఎప్పటిలాగే 15 కేజీల చెక్-ఇన్ లగేజ్, 7 కేజీల క్యాబిన్ లగేజ్ పర్మిషన్ ఉంటుంది. విమాన ప్రయాణంలో ప్యాసింజర్లకు ఫ్రీగా టీ, కాఫీ ఇస్తారు.

## స్పేస్ ఎక్స్.. జుయ్!

న్యూయార్క్: ఎలాన్ మస్క్ నేతృత్వంలోని స్పేస్‌ఎక్స్ వాల్ స్ట్రీట్ స్టాక్ మార్కెట్లో అడుగుపెట్టిన కొద్దిరోజులకే చరిత్ర సృష్టించింది. మంగళవారం నాటి ట్రేడింగ్‌లో కంపెనీ షేర్లు ఏకంగా 14 శాతానికి పైగా దూసుకెళ్లి 220 డాలర్ల మార్కును తాకాయి. ఇది ఐపీఓ ధర 135 డాలర్ల కంటే 62 శాతం ఎక్కువ కావడం విశేషం. ఈ అద్భుతమైన ర్యాలీతో స్పేస్‌ఎక్స్ మార్కెట్ విలువ ఏకంగా 2.85 ట్రిలియన్లకు (సుమారు రూ. 238 లక్షల కోట్లు) చేరుకుంది. ఫలితంగా, 2.64 ట్రిలియన్ డాలర్ల విలువైన ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్‌ను స్పేస్‌ఎక్స్ వెనక్కి నెట్టేసింది. అంతేకాదు, ఒక దశలో 2.92 ట్రిలియన్ డాలర్ల విలువైన సాఫ్ట్‌వేర్ మైక్రోసాఫ్ట్‌ను కూడా అధిగమించి కొద్దిసేపు ప్రపంచంలోనే అత్యంత విలువైన టాప్ కంపెనీల సరసన నిలిచింది. ఉదయం ట్రేడింగ్ మొదలైన కొద్దిసేపటికే 9.1 బిలియన్ డాలర్ల విలువైన స్పేస్‌ఎక్స్ షేర్లు చేతులు మారాయి. ఇది ఎన్విడియా, మైక్రోసాఫ్ట్, టెస్లా, యాపిల్ కంపెనీల మొత్తం ట్రేడింగ్ వాల్యూమ్ కంటే చాలా రెట్లు ఎక్కువ కావడం గమనార్హం. దీంతో ప్రపంచంలోని అత్యంత విలువైన కంపెనీల జాబితాలో స్పేస్‌ఎక్స్ టాప్-5లో చోటు సంపాదించింది. షేర్లపై ఆప్షన్స్ ట్రేడింగ్ ప్రారంభం కావడం, అలాగే త్వరలో ప్రధాన స్టాక్ ఇండెక్స్‌ల్లో చేరే అవకాశం ఉండటం పెట్టుబడిదారుల కొనుగోళ్లకు మరింత ఊతమిచ్చాయి.

## పెట్టుబడులకు ఇదే రైట్ టైమ్: పీయుష్ గోయల్

నీస్: పెట్టుబడులకు ఇదే సరైన సమయమని, ఆలస్యం చేయకుండా దేశీయ పెట్టుబడిదారులు, కార్పొరేట్ సంస్థలు, వెంచర్ క్యాపిటల్ ఫండ్‌లు స్టార్టప్‌లు, కొత్త ఆవిష్కరణలపై పెట్టుబడులు పెంచాలని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ పిలుపునిచ్చారు. ఫ్రాన్స్‌లో జరిగిన 'భారత్ ఇన్నోవేట్స్ 2026' కార్యక్రమంలో మాట్లాడిన ఆయన, భారత స్టార్టప్ వ్యవస్థ ఇప్పుడు కొత్త దశకు చేరుకుందని, పెట్టుబడులకు అవసరమైన విధానాలు, మార్కెట్ అవకాశాలు, మద్దతు వ్యవస్థలు అన్నీ సిద్ధంగా ఉన్నాయని అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద వినియోగదారుల మార్కెట్లలో ఒకటైన భారత్‌లో కొత్త ఆలోచనలకు, కొత్త బిజినెస్ మోడల్స్‌కు అపారమైన అవకాశాలు ఉన్నాయని, పెట్టుబడిదారులను మార్కెట్‌తో అనుసంధానించడంలో ప్రభుత్వం కూడా సహకరిస్తుందని పేర్కొన్నారు. తయారీ రంగ సంస్థలు స్టార్టప్‌లతో భాగస్వామ్యం పెంచి, భారత్‌ను కొత్త ఉత్పత్తులు, సాంకేతికతలకు పరీక్షా వేదికగా మార్చాలని గోయల్ సూచించారు.

# ఫీజులపై నియంత్రణేది?

## సర్కారుపై భగ్గుమన్న ఏబీవీపీ.. హైదరాబాద్‌లో ఉద్రిక్తత, పలువురి అరెస్ట్




హైదరాబాద్, జూన్ 16 (ఈవార్తలు): ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు విచ్చలవిడిగా పెంచుతున్న ఫీజులను అరికట్టాలని, ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు మెరుగుపరచాలని డిమాండ్ చేస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) మంగళవారం హైదరాబాద్‌లో చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్ కార్యాలయం ముట్టడికి యత్నించిన పలువురు ఏబీవీపీ కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే, ఏబీవీపీ జాతీయ కార్యదర్శి శ్రావణ్ బి. రాజ్ నేతృత్వంలో విద్యార్థి సంఘం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో సైఫాబాద్‌లోని కమిషనరేట్ కార్యాలయానికి చేరుకున్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ క్రమంలో కార్యాలయంలోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య స్వల్ప తోపులాట చోటుచేసుకుంది. అనంతరం పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకుని సమీప పోలీస్ స్టేషన్లకు తరలించారు. ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని నియంత్రించేందుకు తక్షణమే 'ఫీజుల నియంత్రణ చట్టం' తీసుకురావాలని ఏబీవీపీ చాలాకాలంగా డిమాండ్ చేస్తోంది. ప్రభుత్వ ఆదేశాలు, హామీలు ఉన్నప్పటికీ, 2026-27 విద్యా సంవత్సరానికి హైదరాబాద్‌లోని అనేక పాఠశాలలు 20 నుంచి 50 శాతం వరకు ఫీజులు పెంచేశాయని విద్యార్థి సంఘం నాయకులు ఆరోపించారు. దీనికి తోడు పుస్తకాలు, యూనిఫామ్‌ల పేరుతో వేల రూపాయలు అదనంగా వసూలు చేస్తూ తల్లిదండ్రులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని వారు మండిపడ్డారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫీజుల నియంత్రణకు కఠిన నిబంధనలు రూపొందించాలని అధికారులను ఆదేశించినప్పటికీ, ఇంతవరకు సమగ్ర చట్టం కార్యరూపం దాల్చలేదు. ప్రభుత్వ జాప్యాన్ని ఆసరాగా చేసుకుని యాజమాన్యాలు ఫీజుల భారం మోపుతున్నాయని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పటిష్ఠమైన చట్టాన్ని అమలు చేయాలని తల్లిదండ్రుల సంఘాలు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

## పాఠశాల వాహనాలు నిబంధనలు పాటించాల్సిందే

**యాజమాన్యాలు, డ్రైవర్లకు రవాణా శాఖ అవగాహన**

జగిత్యాల, జూన్ 16 (ఈవార్తలు): విద్యార్థుల సురక్షిత రవాణా లక్ష్యంగా జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా కేంద్రంలో ప్రైవేటు పాఠశాలల యజమానులు, కరస్పాండెంట్లు, డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా శాఖ అధికారి సంధాని మాట్లాడుతూ విద్యార్థుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదన్నారు. పాఠశాల వాహనాల్లో డ్రైవర్‌తో పాటు అటెండర్, ఉపాధ్యాయుడు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. సీట్ల సామర్థ్యానికి మించి విద్యార్థులను తరలించరాదని స్పష్టం చేశారు. పాఠశాల బస్సులు నడిపే డ్రైవర్లు చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు కనీసం ఐదేళ్ల అనుభవం కలిగి ఉండాలని పేర్కొన్నారు. వాహనాల ఫిట్‌నెస్, భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. నిబంధనలను కచ్చితంగా అమలు చేయడం ద్వారా ప్రమాదాలను నివారించి ప్రతి విద్యార్థి సురక్షితంగా పాఠశాలకు చేరేలా చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు రామారావు, సాయికిరణ్, రియాజ్, ప్రైవేటు పాఠశాలల జిల్లా బాధ్యులు రవిప్రసాద్, గంగారెడ్డి, పాఠశాల యాజమాన్య ప్రతినిధులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

## మహిళల ఆరోగ్య రక్షణకే ఉజ్వల పథకం: అర్వింద్

జగిత్యాల, జూన్ 16 (ఈవార్తలు): మహిళల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకాన్ని అమలు చేస్తోందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. మంగళవారం జగిత్యాల పట్టణం 37వ వార్డుకు చెందిన ఉజ్వల పథకం లబ్ధిదారురాలు పుల్ల మౌనిక-రమేశ్‌ను ఎంపీ అర్వింద్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ బోగ శ్రావణి కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, మహిళలు పొగరహిత వంటను ఉపయోగించడం ద్వారా ఆరోగ్య సమస్యలను దూరం చేసుకోవచ్చని తెలిపారు. మహిళల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉజ్వల యోజన ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. ఇలాంటి ప్రజా సంక్షేమ పథకాలను అందిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జగిత్యాల రూరల్ మండలంలోని మోరపల్లి గ్రామానికి చెందిన కర్నే రాజేందర్‌రెడ్డి నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ కింద రూ.1 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన గొర్రెల పెంపక యూనిట్‌ను ఎంపీ అర్వింద్ పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో ఈ యూనిట్‌ను మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరిబాబు, పట్టణ అధ్యక్షుడు, వార్డు కౌన్సిలర్ కొక్కు అనిత--గంగాధర్, జిల్లా, పట్టణ పదాధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోలీసు విధులకు ఆటంకం.. రిమాండ్

కథలాపూర్, జూన్ 16 (ఈవార్తలు): పోలీసు విధులకు ఆటంకం కలిగించి, సిబ్బందితో అనుచితంగా ప్రవర్తించిన యువకుడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. ఆదివారం రాత్రి కథలాపూర్ గ్రామంలో గొడవ జరుగుతోందని డయల్-100కు సమాచారం అందడంతో బ్లూకోల్ట్ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకున్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన శంభోజి పవన్‌కుమార్ మద్యం మత్తులో పోలీసులతో వాగ్వాదానికి దిగడమే కాకుండా వారిని నెట్టివేసి విధులకు ఆటంకం కలిగించినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా, 14 రోజుల రిమాండ్ విధించారు. ఎస్ఐ రవికిరణ్ మాట్లాడుతూ చట్టవ్యతిరేక కార్యకలాపాలు, పోలీసు విధులకు ఆటంకం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


## రేవంత్‌వి దిగజారుడు రాజకీయాలు

**సీఎంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ధ్వజం**

హైదరాబాద్, జూన్ 16 (ఈవార్తలు): హైదరాబాద్ మెట్రో విస్తరణను కేంద్రం అడ్డుకుంటోందంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ఆరోపణలను కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ఖండించారు. తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే సీఎం తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. మెట్రో రైలు ప్రాజెక్టు విషయంలో రేవంత్ తనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్-1 అమలుకు కేంద్రం రూ.1,200 కోట్లు అందించిందని వెల్లడించారు. మెట్రో విస్తరణ కోసం మరింత చురుగ్గా పనిచేయాలని తానే రేవంత్‌రెడ్డికి లేఖ రాశానన్నారు. ఐఆర్‌ఎఫ్‌సీ ద్వారా రుణం పొందేందుకు కూడా కేంద్రం సహకరిస్తోందని చెప్పారు. ఐఆర్‌ఎఫ్‌సీ రూ.13 వేల కోట్ల రుణ ప్రతిపాదన విషయంలో కొన్ని సాంకేతిక కారణాలు ఉన్నాయని తెలిపారు. వాటిని కేంద్రంతో చర్చించి పరిష్కరించుకోవాల్సింది పోయి రాజకీయ విమర్శలకు దిగడం సరికాదన్నారు. ఆ సమస్యను తనపై నెట్టేందుకు ప్రయత్నించడం బాధాకరమన్నారు. తెలంగాణ, హైదరాబాద్ అభివృద్ధిపై తమకు ఎవరూ పాఠాలు చెప్పాల్సిన అవసరం లేదని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. జహీరాబాద్‌లో ఇండస్ట్రియల్ ప్రాజెక్టు, ఎన్‌టీపీసీ విద్యుత్ ప్రాజెక్టు, ధాన్యం కొనుగోలు వంటి అంశాల్లో కేంద్రం సహకరిస్తోందన్నారు. మూసీ పునరుజ్జీవన కార్యక్రమానికి అవసరమైన రుణాల మంజూరుకు కూడా కేంద్రం ఎన్‌ఓసీ ఇచ్చిందని తెలిపారు. రాష్ట్రాల్లో ఏ పార్టీ అధికారంలో ఉన్నా కేంద్రం ఎలాంటి వివక్ష చూపదని స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందన్నారు. దిగజారుడు రాజకీయాలకు పాల్పడకుండా అభివృద్ధి అంశాలపై కేంద్రంతో సమన్వయం చేసుకుని ముందుకెళ్లాలని సూచించారు.

# హైదరాబాద్‌లో రోడ్డుకు ట్రంప్ పేరు

**కాంగ్రెస్ సర్కార్ నిర్ణయం**



హైదరాబాద్, జూన్ 16 (ఈవార్తలు): భాగ్యనగరంలో పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. గ్లోబల్ ఐకాన్‌గా ఉన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గౌరవార్థం హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని ఒక ప్రముఖ రహదారికి 'డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ'గా నామకరణం చేయనున్నారు. నానక్‌రామ్‌గూడలోని యూఎస్ కాన్సులేట్ జనరల్ కార్యాలయానికి ఆనుకుని ఉన్న ప్రస్తుత 'యూఎస్ కాన్సులేట్ రోడ్డు'ను ఈ పేరుతో మార్చనున్నట్లు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కార్యాలయం అధికారికంగా ప్రకటించింది. జూన్ 23న ఈ రోడ్డును అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించనున్నారు. అమెరికా స్వాతంత్ర్య దినోత్సవం (జులై 4)కి ముందే జరగనున్న ఈ వేడుకకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు భారతదేశంలో అమెరికా రాయబారి సెర్గియో గోర్, పలువురు ఉన్నతాధికారులు, దౌత్యవేత్తలు, ఐటీ పరిశ్రమ ప్రముఖులు హాజరుకానున్నారు. తెలంగాణ ఐటీ రంగానికి, ఆర్థిక వృద్ధికి అమెరికా అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతగా, అలాగే ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు గాను ట్రంప్ పేరును ప్రతిపాదిస్తూ గతంలో రేవంత్‌రెడ్డి చేసిన ఆలోచన ఇప్పుడు కార్యరూపం దాల్చింది. హైదరాబాద్‌ను అంతర్జాతీయ ఆవిష్కరణల హబ్‌గా మార్చడంలో భాగంగా కీలక రహదారులకు గ్లోబల్ బ్రాండ్లు, ప్రముఖుల పేర్లు పెట్టే బృహత్తర ప్రాజెక్టులో ఇది భాగం. ఇటీవల రావిర్యాల ఇంటర్‌ఛేంజ్‌కు పారిశ్రామిక దిగ్గజం 'రతన్ టాటా' పేరు పెట్టిన ప్రభుత్వం.. రాబోయే రోజుల్లో గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి దిగ్గజ కంపెనీల పేర్లను కూడా కొన్ని జంక్షన్లకు పెట్టాలని భావిస్తోంది. 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్' కంటే ముందే అంతర్జాతీయ ఇన్వెస్టర్ల దృష్టిని ఆకర్షించేందుకు ఈ వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. ఈ నిర్ణయంపై రాష్ట్రంలో రాజకీయ రగడ మొదలైంది. రోడ్ల పేర్ల మార్పుపై బీజేపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ ప్రభుత్వ ప్రాధాన్యతలను తప్పుబడుతోంది. అయినప్పటికీ, ఈ నిర్ణయం వల్ల అంతర్జాతీయంగా హైదరాబాద్ ప్రొఫైల్ మరింత పెరుగుతుందని, ఐటీ రంగంలోని లక్షలాది మంది యువ నిపుణులకు అమెరికా కంపెనీలతో మరిన్ని కొత్త అవకాశాలు దక్కుతాయని మద్దతుదారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# పిల్లల గుడ్లు, పప్పుల్లో రూ. 2 వేల కోట్ల స్కాం

**గురుకుల పాఠశాలల్లో భారీ కుంభకోణం**

**రేవంత్ అన్నదమ్ములే కోటీశ్వరులయ్యారు**

**మాజీమంత్రి హరీశ్ రావు తీవ్ర ఆరోపణలు**



హైదరాబాద్, జూన్ 16 (ఈవార్తలు): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం టార్గెట్‌గా బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు విమర్శల డోస్ పెంచాయి. తాజాగా జరిగిన బీఆర్ఎస్ డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురుకుల పాఠశాలల టెండర్లలో ఏకంగా రూ. 2,000 కోట్ల భారీ కుంభకోణం జరిగిందని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ విసిరిన సవాళ్లకు హరీశ్ రావు కౌంటర్ ఇచ్చారు. గురుకులాల్లో యూనిఫాంలు, టైల కోసం రూ. 1,200 కోట్లు.. ఉప్పులు, పప్పులు, చికెన్, గుడ్ల కోసం రూ. 800 కోట్లకు టెండర్లు పిలిచారని, ఈ రెండు కలిపితేనే రూ. 2,000 కోట్లు అవుతుందని లెక్కలు చెప్పారు. తమ శాఖల్లో ఏం జరుగుతుందో కూడా తెలియని స్థితిలో మంత్రులు ఉన్నారని ఎద్దేవా చేశారు. చివరకు గురుకులాల్లో చదువుకునే పేద పిల్లలకు పెట్టే గుడ్లు, పప్పుల్లో కూడా స్కామ్ చేస్తారా? అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. ఎన్నికల ముందు కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తానని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని హరీశ్ రావు గుర్తుచేశారు. కానీ ఇప్పటివరకు రాష్ట్రంలో ఒక్క మహిళ కూడా కోటీశ్వరురాలు కాలేదని, అయితే రేవంత్ అన్నదమ్ములు మాత్రం కోటీశ్వరులయ్యారని ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రే స్వయంగా మొత్తం టెండర్లు పిలుస్తూ, ఆ నిధులన్నీ తన అన్నదమ్ములకే కట్టబెడుతున్నారని.. అందుకే ఈ వ్యవహారాలు రాష్ట్ర మంత్రులకు కూడా తెలియడం లేదని ఆరోపించారు.

## మాంసం బొమ్మలతో గాలింపు!

**చిన్నారి జ్ఞానేశ్వరి మిస్సింగ్ కేసులో వీడని ఉత్కంఠ**

కాకినాడ, జూన్ 16 (ఈవార్తలు): ఏపీలోని కాకినాడ జిల్లాలోని పామాయిల్ తోటలో అదృశ్యమైన రెండేళ్ల చిన్నారి సుంకర జ్ఞానేశ్వరి ఆచూకీ పది రోజులు దాటినా లభించలేదు. దీంతో గాలింపు చర్యలను ముమ్మరం చేసిన అధికారులు, వన్యమృగాల ఉనికిని గుర్తించేందుకు ఒక సరికొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. పాప తప్పిపోయిన ప్రాంతంలో ఇనుప బోనును ఏర్పాటు చేసి, అందులో చిన్నారిని పోలిన రెండు బొమ్మలను ఉంచారు. ఆ బొమ్మల్లో మాంసం ముక్కలను పెట్టి, జంతువులను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. వాటి కదలికలను పసిగట్టేందుకు సమీపంలో కెమెరా ట్రాప్‌లను ఏర్పాటు చేసి నిశితంగా పర్యవేక్షిస్తున్నారు. చిన్నారిని ఏదైనా వన్యమృగం ఎత్తుకెళ్లి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నప్పటికీ, దానికి సంబంధించిన ఆధారాలేవీ ఇప్పటివరకు లభించలేదు. సుమారు 400 మందికి పైగా పోలీసు, అటవీ శాఖ సిబ్బంది, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు గాలింపు చర్యల్లో పాల్గొంటున్నాయి. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, హోంమంత్రి అనిత ఆదేశాల మేరకు జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్డీఆర్ఎఫ్) కూడా రంగంలోకి దిగింది. థర్మల్ డ్రోన్లతో సైతం ఆ ప్రాంతాన్ని జల్లెడ పడుతున్నారు. ఈ కేసులో మిస్టరీని మరింత పెంచుతూ, పాపతో పాటు అదృశ్యమైన పెంపుడు కుక్క జూన్ 13న మృతి చెందింది. జూన్ 9న ఒంటరిగా ఇంటికి తిరిగి వచ్చిన ఈ కుక్క, అప్పటి నుంచి ఆహారం తీసుకోకుండా వింతగా ప్రవర్తించింది. దీనికి జీపీఎస్ ట్రాకర్ అమర్చి ఆచూకీ కనుగొనే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. సుమారు 80 కిలోమీటర్లు తిరిగిన తర్వాత ఇంటికి చేరిన ఈ కుక్క, వైరల్ ఇన్ఫెక్షన్ సోకి మరణించి ఉండవచ్చని భావిస్తున్నారు. జూన్ 6న తుని మండలం సిహెచ్. అగ్రహారంలో తల్లిదండ్రులు గణేష్, భవానితో కలిసి పామాయిల్ తోటకు వెళ్లిన జ్ఞానేశ్వరి అదృశ్యమైంది. తల్లిదండ్రుల మధ్య సమన్వయ లోపం కారణంగానే పాప తప్పిపోయినట్లు పోలీసులు నిర్ధారించారు. పాప ఆచూకీ తెలిపిన వారికి జిల్లా యంత్రాంగం రూ.లక్ష రివార్డును ప్రకటించింది.

## ఏపీలో నీట్ విద్యార్థులకు ఉచిత బస్సు

విజయవాడ, జూన్ 16 (ఈవార్తలు): జూన్ 21న దేశవ్యాప్తంగా జరగబోయే 'నీట్' రీ-ఎగ్జామినేషన్ జరగబోతోంది. ఈ నేపథ్యంలో ఈ పరీక్ష రాస్తున్న ఆంధ్రప్రదేశ్ విద్యార్థులకు కూటమి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ఎగ్జామ్ సెంటర్ల దూరభారం, ప్రయాణ ఖర్చులతో టెన్షన్ పడుతున్న విద్యార్థులకు ఊరటనిస్తూ ఏపీఎస్‌ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయాన్ని కల్పిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. రవాణా ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ స్పెషల్ ప్లాన్: టికెట్ ఫ్రీ.. హాల్ టికెట్ ఉంటే చాలు: పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు బస్సు కండక్టర్‌కు తమ 'నీట్ హాల్ టికెట్' చూపిస్తే సరిపోతుంది. రూపాయి చార్జ్ లేకుండా ఉచితంగా ప్రయాణించవచ్చు. రద్దీ రూట్లలో స్పెషల్ బస్సులు: ఎగ్జామ్ రోజున విద్యార్థులు సకాలంలో సెంటర్లకు చేరుకునేలా ఏపీఎస్‌ఆర్టీసీ ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేసింది. రద్దీ ఎక్కువగా ఉండే మార్గాలను గుర్తించి, అక్కడ సాధారణ బస్సులతో పాటు అదనంగా ప్రత్యేక బస్సులను నడపనుంది.

## అన్నలు ఉంటే ఆఫీసర్లకు హడల్!

**'బాయి బాట' కార్యక్రమంలో కవిత వ్యాఖ్యలు**

మంచిర్యాల, జూన్ 16 (ఈవార్తలు): టీఆర్ఎస్ నాయకురాలు కల్వకుంట్ల కవిత మావోయిస్టుల ఉనికిపై కీలక వ్యాఖ్యలు చేశారు. గతంలో అడవుల్లో మావోయిస్టులు ఉన్న సమయంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించేవారని, ప్రస్తుతం వారు లేకపోవడంతో అధికారుల ప్రవర్తనలో మార్పు వచ్చిందని ఆమె పేర్కొన్నారు. సింగరేణి కార్మికుల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు ఆమె చేపట్టిన 'బాయి బాట' కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. తన వారం రోజుల పర్యటనలో భాగంగా మంచిర్యాల జిల్లాలోని ఆర్కే-7 గని వద్దకు చేరుకున్న కవితను పోలీసులు, సింగరేణి భద్రతా సిబ్బంది గేటు వద్దే అడ్డుకున్నారు. ఈ క్రమంలో అక్కడ కొద్దిసేపు వాగ్వాదం నెలకొంది. చివరకు ఆమె ఆంక్షలను అధిగమించి ముందుకు సాగి, కార్మికులతో సమావేశమయ్యారు. మందమర్రిలోని కాసిపేట-1 గని నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన కవిత, పర్యటనలో రెండో రోజైన సోమవారం ఈ ఘటనను ఎదుర్కొన్నారు. గేట్ మీటింగ్ నిర్వహించకుండా అధికారులు అడ్డుకోవడంపై ఆమె తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆమె ధ్వజమెత్తారు. గతంలో కార్మికుల సమస్యలపై రాహుల్ గాంధీ, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సింగరేణి ప్రాంతానికి వచ్చినప్పుడు లేని ఆంక్షలు ఇప్పుడు ఎందుకు విధిస్తున్నారని ప్రశ్నించారు. కేవలం పోలీసులను అడ్డం పెట్టుకుని ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఆమె ఆరోపించారు. కార్మికుల హక్కులను కాలరాస్తే టీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని, వారి పక్షాన పోరాటం కొనసాగిస్తుందని కవిత హెచ్చరించారు.

## నారా లోకేశ్‌తో జాంటీ రోడ్స్ భేటీ

విజయవాడ, జూన్ 16 (ఈవార్తలు): ఏపీ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, దక్షిణాఫ్రికా లెజెండరీ క్రికెటర్ జాంటీ రోడ్స్‌తో భేటీ అయ్యారు. క్రీడల్లో తన అభిరుచి, క్రమశిక్షణ, నైపుణ్యంతో ప్రపంచవ్యాప్తంగా ఎన్నో తరాల క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలిచిన జాంటీ రోడ్స్‌ను కలవడం ఆనందంగా ఉందని లోకేశ్ పేర్కొన్నారు. ఈ సమావేశానికి సంబంధించిన వివరాలను ఆయన సోషల్ మీడియా ద్వారా పంచుకున్నారు. ఈ భేటీలో క్రీడలు, యువత అభివృద్ధి, క్రీడల్లో అత్యుత్తమ సంస్కృతిని నెలకొల్పడం వంటి అంశాలపై తామిద్దరం ఆసక్తికరంగా చర్చించుకున్నామని లోకేశ్ తెలిపారు. ప్రపంచస్థాయి క్రీడా వ్యవస్థను నిర్మించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. అనుసరిస్తున్న అత్యుత్తమ పద్ధతులను అందిపుచ్చుకుని, భవిష్యత్ ఛాంపియన్‌లను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకెళ్తామని మంత్రి లోకేశ్ వివరించారు.

## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.

## ఏపీ పీఈసెట్ ఫలితాలు విడుదల

అమరావతి, జూన్ 16 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీ పీఈసెట్-2026) ఫలితాలు విడుదలయ్యాయి. రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ ఈ ఫలితాలను మంగళవారం ప్రకటించారు. ఈ ఏడాది పీఈసెట్‌లో మొత్తం 89.76 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు ఆయన తెలిపారు. ఫలితాల వివరాల్లోకి వెళితే, పీఈసెట్-2026 కోసం మొత్తం 4,037 మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా, 2,958 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 2,655 మంది అర్హత సాధించారు. అర్హత సాధించిన వారిలో పురుషులు అధికంగా ఉన్నారు. పరీక్షకు హాజరైన పురుషుల్లో 92.91 శాతం (1,993 మంది) ఉత్తీర్ణులు కాగా, మహిళల్లో 81.43 శాతం (662 మంది) ఉత్తీర్ణత సాధించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ, ఫిజికల్ ఎడ్యుకేషన్, క్రీడల రంగంలో కెరీర్‌ను ఎంచుకునే దిశగా ముందడుగు వేసిన అభ్యర్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. వారి భవిష్యత్ ప్రయత్నాలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. అభ్యర్థులు తమ ఫలితాలను అధికారిక వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు. ర్యాంక్ కార్డులను కూడా ఇదే వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అదనంగా, 'మన మిత్ర' వాట్సాప్ నంబర్ 9552300009 ద్వారా కూడా ఫలితాలను తెలుసుకునే సౌకర్యాన్ని కల్పించారు.

## జనసేన 'జాయినింగ్స్ కమిటీ' ఏర్పాటు

మంగళగిరి, జూన్ 16 (ఈవార్తలు): జనసేన పార్టీ సంస్థాగత వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా ఆ పార్టీ అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. విద్యావంతులు, సామాజికవేత్తలు, తటస్థులను పార్టీలోకి ఆహ్వానించే దిశగా కీలక ప్రకటన చేశారు. 14 మంది సభ్యులతో కూడిన 'జాయినింగ్స్ కమిటీ'ని ఏర్పాటు చేస్తూ అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఈ కమిటీలో జనసేన ప్రజాప్రతినిధులు, సీనియర్ నేతలకు స్థానం కల్పించారు. ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాస్, వంశీకృష్ణ శ్రీనివాస్, పంతం నానాజీ, ఎంపీ లింగమనేని రమేష్, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కిలారి రోశయ్య, సామినేని ఉదయభాను కమిటీ సభ్యులుగా ఉన్నారు. ఇతర సభ్యులుగా పార్టీ సీనియర్ నేతలు కొటికలపూడి చినబాబు, డా. హరిప్రసాద్, డా. పెదపూడి విజయ్ కుమార్, కొరికాన రవికుమార్, వంపూరు గంగులయ్య, టి.సి. వరుణ్, ఆరణి మదన్‌లను నియమించారు. పవన్ తన ఢిల్లీ పర్యటన ముగిసిన అనంతరం ఈ కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, చేరికల విధానాలు, విధివిధానాలపై స్పష్టమైన దిశానిర్దేశం చేయనున్నారు. ఈ కమిటీ ఆంధ్రప్రదేశ్‌లోని చేరికలను పర్యవేక్షిస్తుందని పార్టీ వర్గాలు తెలిపాయి.

## సర్‌పై జాగ్రత్త: సీతక్క

ములుగు, జూన్ 16 (ఈవార్తలు): ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై తెలంగాణ మంత్రి సీతక్క కీలక వ్యాఖ్యలు చేశారు. ములుగు జిల్లా కేంద్రంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లు, కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. బూత్ స్థాయి ఏజెంట్లు ఎన్నికల వ్యవస్థకు వెన్నెముక వంటివారని అన్నారు. ప్రతి అర్హుడైన పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడాల్సిన బాధ్యత వారిపైనే ఉందన్నారు. ఏ ఒక్క నిజమైన ఓటరు కూడా జాబితా నుంచి తొలగించబడకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తమకు కేటాయించిన హ్యాండ్‌బుక్‌లోని నిబంధనలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని, క్షేత్రస్థాయిలో ఓటర్లకు అండగా నిలవాలని కోరారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి అవకతవకలు జరగకుండా, కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా వ్యవహరించాలని మంత్రి పిలుపునిచ్చారు.

## ముస్సోరీలో విశాఖ టెక్కీ అనుమానాస్పద మృతి

ముస్సోరీ: విహారయాత్రలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఉత్తరాఖండ్‌లోని ప్రముఖ పర్యాటక కేంద్రం ముస్సోరీలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ యువ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. భర్తతో కలిసి వెకేషన్‌కు వెళ్లిన ఆమె, తాము బస చేసిన హోంస్టే గదిలో నిన్న ఉదయం విగతజీవిగా కనిపించడం కలకలం రేపింది. విశాఖపట్నానికి చెందిన పి. రాధా గాయత్రి (27) ఢిల్లీ సమీపంలోని గురుగ్రామ్‌లో ఓ ఐటీ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తోంది. పుణేలో ఐటీ నిపుణుడిగా పనిచేస్తున్న సౌమ్య శ్రీచరణ్‌తో ఆమెకు 2025 నవంబర్ 8న వివాహమైంది. వీరు విహారయాత్ర కోసం ఢిల్లీ నుంచి బయలుదేరి, జూన్ 14న రాత్రి మసూరీ-ధనౌల్తి రోడ్డులోని కియానా హోంస్టేలో గది తీసుకున్నారు. ఘటన జరిగిన రోజు రాత్రి తాము మద్యం సేవించామని, తెల్లవారుజామున 3:30 గంటల సమయంలో నిద్రపోయినట్లు భర్త శ్రీచరణ్ పోలీసులకు తెలిపాడు. ఉదయం నిద్రలేచి చూసేసరికి, గాయత్రి నేలపై వివస్త్రగా, అపస్మారక స్థితిలో పడి ఉందని, ఆమె ముక్కు నుంచి రక్తం వస్తోందని వివరించాడు. మూత్రం మడుగులో ఆమె పడి ఉందని తెలిపాడు. గదిలో రక్తపు మరకలతో పాటు రెండు ఖాళీ మద్యం సీసాలను పోలీసులు గుర్తించారు. సోమవారం ఉదయం 7:23 గంటలకు సమాచారం అందుకున్న పోలీసులు, అంబులెన్స్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయత్రి అప్పటికే మరణించినట్లు అక్కడి ఫార్మసిస్ట్ ధృవీకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం డెహ్రాడూన్‌లోని కొరొనేషన్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై సర్కిల్ ఆఫీసర్ మనోజ్ అస్వాల్ మాట్లాడుతూ, "పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాతే మరణానికి గల స్పష్టమైన కారణాలు తెలుస్తాయి. నిపుణులైన వైద్యుల బృందంతో, వీడియో రికార్డింగ్ సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించాలని కోరాము" అని తెలిపారు. విశాఖలో ఉన్న గాయత్రి తల్లిదండ్రులకు సమాచారం అందించినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## నీట్ ఆత్మహత్య బాధితులకు రూ.కోటి ఇవ్వాలి

**సీజేపీ డిమాండ్.. నాగ్‌పూర్‌లో ఆకాంక్ష చతుర్వేది కుటుంబానికి పరామర్శ**

నాగ్‌పూర్: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో, పేపర్ లీకేజీల కారణంగా తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యలకు పాల్పడిన విద్యార్థుల కుటుంబాలకు కోటి రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే డిమాండ్ చేశారు. ప్రశ్నపత్రాల లీకేజీల వల్ల తీవ్ర మానసిక ఒత్తిడికి లోనై తనువు చాలించిన పలువురు విద్యార్థుల కుటుంబాలను ఆయన ఇటీవల పరామర్శించారు. ఆయా కుటుంబాలన్నీ ప్రస్తుతం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని, వ్యవస్థలోని లోపాలకు తమ పిల్లలు బలికావడంతో వారు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం తక్షణమే స్పందించి, బాధిత కుటుంబాల ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ఒక్కో కుటుంబానికి కోటి రూపాయల పరిహారం అందించాలని ఆయన కోరారు. భవిష్యత్తులో మరే విద్యార్థి కూడా ఇటువంటి నిస్సహాయ స్థితికి గురికాకుండా ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వ్యవస్థలోని లోపాల వల్ల విద్యార్థుల జీవితాలు బలికావడం అత్యంత విషాదకరమని, దీనికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని ఆయన స్పష్టం చేశారు. నాగ్‌పూర్‌లో ఆత్మహత్యకు పాల్పడిన నీట్ విద్యార్థిని ఆకాంక్ష చతుర్వేది కుటుంబాన్ని అభిజీత్ పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. ఈ కష్టకాలంలో వారికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. భవిష్యత్తులో మరే విద్యార్థి ఇటువంటి దుస్థితికి గురికాకుండా చూడాలని, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సహాయం ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.

## 15 కోట్ల మందిపై ఆంక్షల్లా!

**టెలిగ్రాంపై ఆంక్షలపై సీఈవో ఆగ్రహం**

న్యూయార్క్: నీట్-యూజీ 2026 పునఃపరీక్షను అత్యంత పకడ్బందీగా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ప్రముఖ మెసేజింగ్ యాప్ టెలిగ్రామ్‌పై దేశవ్యాప్తంగా జూన్ 22 వరకు తాత్కాలిక ఆంక్షలు విధించింది. పరీక్ష సమయంలో చోటుచేసుకునే అక్రమాలను, తప్పుడు ప్రచారాలను అరికట్టడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) సిఫార్సు మేరకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టంలోని సెక్షన్ 69ఏ కింద ఈ ఆదేశాలు జారీ అయ్యాయి. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై టెలిగ్రామ్ సీఈఓ పావెల్ దురోవ్ స్పందించారు. కొందరు చేసే తప్పులకు భారత్‌లోని 150 మిలియన్ల మంది సాధారణ వినియోగదారులను శిక్షించడం సమంజసం కాదని ఆయన 'ఎక్స్' వేదికగా విమర్శించారు. ఈ నిషేధం వల్ల ఆశించిన ప్రయోజనం ఉండదని, లీకేజీలకు పాల్పడేవారు ఇతర ప్రత్యామ్నాయ మార్గాలను ఆశ్రయిస్తారని ఆయన అభిప్రాయపడ్డారు. కాగా, ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా గూగుల్ ఇప్పటికే తన ప్లే స్టోర్ నుంచి టెలిగ్రామ్‌ను తొలగించగా, యాపిల్ కూడా త్వరలోనే ఈ దిశగా చర్యలు తీసుకోనుంది.

## వెళ్తే వెళ్లిపోండి.. బాధపడతారు!

**శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ థాకరే**

ముంబై: శివసేన (యూబీటీ) ఎంపీలు ఏకనాథ్ షిండే పార్టీ (శివసేన)లో చేరబోతున్నారని వస్తున్న వార్తలు కలకలం రేపుతున్నాయి. ఈ వార్తలపై పార్టీ అధినేత ఉద్ధవ్ థాకరే తీవ్రంగా స్పందించారు. పార్టీని వదిలిపోవడానికి ఎవరికైనా స్వేచ్ఛ ఉందని, వారిని ఎవరినీ ఉండమని బలవంతం చేయబోమని స్పష్టం చేశారు. 2022లో జరిగిన భారీ చీలికను గుర్తు చేస్తూ ఉద్ధవ్ మాట్లాడుతూ, "అప్పట్లో 40 మంది ఎమ్మెల్యేలు వెళ్లిపోయారు. ఎవరినీ పార్టీలో ఉండమని బలవంతం చేయాలనుకోలేదు. ఇప్పుడు కూడా మాది అదే అభిప్రాయం" అని వెల్లడించారు. పార్టీని వీడిన వారు ఒకరోజు తప్పకుండా పశ్చాత్తాపపడతారని, అయితే అప్పటికి సమయం మించిపోయి ఉంటుందని అన్నారు. "ఈ రోజు సమయం మనది కాకపోవచ్చు, కానీ రేపు మనదే. అంతవరకు ఓపికగా ముందుకు సాగుతాం" అని అన్నారు. ప్రస్తుతం 'ఆపరేషన్ టైగర్' పేరుతో షిండే వర్గం ఠాక్రే సేన ఎంపీలను తమ వైపు తిప్పుకోవడానికి ప్రయత్నాలు చేస్తోందని వార్తలు ఊపందుకున్న నేపథ్యంలో ఉద్ధవ్ ఈ మేరకు స్పందించారు. మరోవైపు, ఈ వార్తలను శివసేన (యూబీటీ) సీనియర్ ఎంపీ సంజయ్ రౌత్ ఖండించారు. ఎంపీలు పార్టీ వీడబోతున్నారనే సమాచారాన్ని ఆయన తోసిపుచ్చారు.

## నీట్ రీ-టెస్ట్ భద్రతా చర్యలు సరికావు: అన్నామలై

చెన్నై: బీజేపీ మాజీ నేత అన్నామలై.. కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. జూన్ 21న నిర్వహించనున్న నీట్ రీ-టెస్ట్ కోసం చేపట్టిన భారీ భద్రతా ఏర్పాట్లు విద్యార్థుల్లో విశ్వాసం పెంచడం కంటే ఒత్తిడికి గురి చేసే ప్రమాదం ఉందని విమర్శించారు. సోషల్ మీడియా వేదికగా స్పందించిన ఆయన.. ప్రశ్నపత్రాల లీకేజీ ఆరోపణల నేపథ్యంలో కేంద్రం ఎన్నడూ లేని విధంగా భద్రతా వ్యవస్థను అమలు చేస్తోందన్నారు. సీఆర్పీఎఫ్, సీఐఎస్ఎఫ్ భద్రత, భారత వైమానిక దళం ద్వారా ప్రశ్నపత్రాల రవాణా, ఏఐ ఆధారిత సీసీటీవీ పర్యవేక్షణ, బయోమెట్రిక్, ఫేషియల్ రికగ్నిషన్ తనిఖీలు, పలుదశల తనిఖీలు వంటి చర్యలను ఆయన ప్రస్తావించారు. ఇలాంటి ఏర్పాట్లు అత్యంత సున్నితమైన భద్రతా ఆపరేషన్లలో కనిపిస్తాయని, విద్యార్థుల పరీక్షలకు మాత్రం అరుదుగా ఉంటాయని అన్నారు.

# డీల్‌లో ఖతార్ కీ రోల్

**అమెరికా- ఇరాన్ ఒప్పందంలో కీలక పాత్ర**




## తిరిగి ప్రారంభం కానున్న హర్మూజ్ రవాణా.. జెనీవాలో ఒప్పందంపై సంతకాలకు సన్నాహాలు

జెనీవా: అమెరికా, ఇరాన్ దేశాల మధ్య గత వంద రోజులకు పైగా కొనసాగుతున్న తీవ్ర ఉద్రిక్తతలకు తెరపడే సూచనలు కనిపిస్తున్నాయి. ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం వెనుక ఖతార్ జరిపిన నిరంతర, రహస్య దౌత్యం కీలక పాత్ర పోషించినట్లు అంతర్జాతీయ కథనాలు వెల్లడిస్తున్నాయి. ఈ ఒప్పందంతో కీలకమైన హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవడంతో పాటు, అణు చర్చల పునరుద్ధరణకు మార్గం సుగమం కానుంది. ఈ ఒప్పందంపై త్వరలోనే తటస్థ వేదికైన జెనీవాలో అధికారికంగా సంతకాలు జరగనున్నాయి. ఒప్పందం నిబంధనల ప్రకారం, ఇరు పక్షాలు తక్షణమే కాల్పుల విరమణను పాటించాల్సి ఉంటుంది. దీనితో పాటు, ప్రపంచ ఇంధన సరఫరాకు అంతరాయం కలిగించిన హర్మూజ్ జలసంధిలో నౌకల రాకపోకలను పునరుద్ధరించనున్నారు. కొన్ని ధ్రువీకరించదగిన చర్యలకు ప్రతిఫలంగా ఇరాన్‌పై ఉన్న ఆంక్షలను దశలవారీగా సడలించేందుకు కూడా అంగీకారం కుదిరింది. 2026 ప్రారంభం నుంచి అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య చోటుచేసుకున్న సైనిక చర్యలతో ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు పరాకాష్ఠకు చేరాయి. చర్చల ప్రారంభ దశలో పాకిస్థాన్ చొరవ తీసుకుని ఇరు దేశాల మధ్య సంప్రదింపులకు వేదిక కల్పించింది. అయితే, అణు పరిమితులు, యురేనియం నిల్వలు వంటి క్లిష్టమైన సాంకేతిక అంశాలపై ఏకాభిప్రాయం సాధించడంలో ఆ ప్రయత్నాలు పూర్తిస్థాయిలో ఫలించలేదు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో ఖతార్ రంగంలోకి దిగింది. అమెరికా, ఇరాన్ దేశాలతో సత్సంబంధాలు కలిగిన ఖతార్ రాయబారులు, ఇరు దేశాల మధ్య రహస్య మంతనాలు జరిపి, ఒప్పందంలోని సంక్లిష్టాంశాలపై ఏకాభిప్రాయం సాధించడంలో సఫలమయ్యారు. హర్మూజ్ జలసంధిని తిరిగి తెరిచేందుకు, నావికాదళ దిగ్బంధనాన్ని సడలించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ధ్రువీకరించారు. నెలల తరబడి కొనసాగిన అనిశ్చితి తర్వాత ఈ ఒప్పందం ఒక చారిత్రాత్మక ముందడుగుగా దౌత్యవేత్తలు భావిస్తున్నారు.

# టీసీఎస్‌పై రూ.1,986 కోట్ల ఫైన్

**ట్రేడ్ సీక్రెట్స్ చౌర్యం కేసులో అమెరికా కోర్టు తీర్పు**




న్యూయార్క్: భారత ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్)కు అమెరికాలో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. దశాబ్దాలుగా నడుస్తున్న ట్రేడ్ సీక్రెట్స్ (వ్యాపార రహస్యాలు) చౌర్యం కేసులో అమెరికా సుప్రీంకోర్టులో ఆ సంస్థకు చుక్కెదురైంది. ఈ కేసులో జోక్యం చేసుకునేందుకు సుప్రీంకోర్టు నిరాకరించడంతో టీసీఎస్‌పై దాదాపు 220 మిలియన్ డాలర్ల (సుమారు రూ.1,986 కోట్లు) ఆర్థిక భారం పడటం ఖాయమైంది. ఈ నిర్ణయంతో ఏళ్లుగా కొనసాగుతున్న న్యాయపోరాటానికి తెరపడినట్లయింది. ఈ వివాదం మూలాలు అమెరికాలోని లైఫ్ ఇన్సూరెన్స్ సాఫ్ట్‌వేర్ వ్యాపారంలో ఉన్నాయి. డీఎక్స్‌సీ టెక్నాలజీ అనే సంస్థకు చెందిన పూర్వ కంపెనీ అయిన కంప్యూటర్ సైన్సెస్ కార్పొరేషన్ (సీఎస్‌సీ), 1990లలో తమ యాజమాన్యంలోని ఒక ప్రత్యేకమైన లైఫ్ ఇన్సూరెన్స్ సాఫ్ట్‌వేర్‌ను ట్రాన్స్‌అమెరికా అనే బీమా సంస్థకు లైసెన్స్ ఇచ్చింది. కొన్నేళ్ల తర్వాత ట్రాన్స్‌అమెరికాకు చెందిన 2,200 మందికి పైగా ఉద్యోగులను టీసీఎస్ నియమించుకుంది. ఈ ఉద్యోగుల ద్వారా సీఎస్‌సీకి చెందిన రహస్య సాఫ్ట్‌వేర్ సమాచారాన్ని, దాని పనితీరును తెలుసుకుని, దానికి పోటీగా ఒక కొత్త ఇన్సూరెన్స్ ప్లాట్‌ఫామ్‌ను టీసీఎస్ అభివృద్ధి చేసిందని డీఎక్స్‌సీ ఆరోపించింది. ఈ ఆరోపణలతో డీఎక్స్‌సీ, 2019లో డల్లాస్‌లోని ఫెడరల్ కోర్టులో టీసీఎస్‌పై దావా వేసింది. టీసీఎస్ తమ వ్యాపార రహస్యాలను దుర్వినియోగం చేసిందని, గోప్యమైన సమాచారంతో లబ్ధి పొందిందని ఆరోపించింది. అయితే, టీసీఎస్ మొదటి నుంచి ఈ ఆరోపణలను ఖండిస్తూ వచ్చింది. తాము పొందిన సమాచారం రహస్యమైనది కాదని, చట్టబద్ధంగానే సాఫ్ట్‌వేర్‌ను యాక్సెస్ చేశామని వాదించింది. ఈ వివాదం 2023లో కీలక మలుపు తిరిగింది. విచారణ జరిపిన జ్యూరీ, టీసీఎస్ ఉద్దేశపూర్వకంగానే వ్యాపార రహస్యాలను దొంగిలించిందని నిర్ధారించి, 210 మిలియన్ డాలర్ల నష్టపరిహారం చెల్లించాలని సిఫార్సు చేసింది. ఇది కేవలం సలహా పూర్వకమైనదే అయినా, డీఎక్స్‌సీకి ఇది పెద్ద విజయంగా నిలిచింది. ఆ తర్వాత 2024లో యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి బ్రాంట్‌లీ స్టార్ ఈ మొత్తాన్ని 168 మిలియన్ డాలర్లకు తగ్గించారు. ఇందులో 56 మిలియన్ డాలర్లు నష్టపరిహారంగా, 112 మిలియన్ డాలర్లు జరిమానాగా (శిక్షార్హమైన నష్టపరిహారం) విధించారు. ఈ తీర్పును టీసీఎస్ అప్పీల్స్ కోర్టులో సవాలు చేయగా, 2025లో ఫిఫ్త్ యూఎస్ సర్క్యూట్ కోర్ట్ ఆఫ్ అప్పీల్స్ కూడా కింది కోర్టు తీర్పునే సమర్థించింది. దీంతో టీసీఎస్ తమ చివరి ప్రయత్నంగా అమెరికా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. టీసీఎస్ దాఖలు చేసిన అప్పీల్‌ను విచారించేందుకు జూన్ 15న అమెరికా సుప్రీంకోర్టు నిరాకరించింది. దీంతో 168 మిలియన్ డాలర్ల జరిమానా తీర్పు అధికారికంగా ఖరారైంది. దీనికి తోడు ఈ కేసు కోసం గతంలో, తాజాగా కేటాయించిన నిధులను కలుపుకుని టీసీఎస్‌పై మొత్తం 220 మిలియన్ డాలర్ల భారం పడుతుందని సంస్థ ప్రకటించింది. టీసీఎస్ వంటి భారీ కంపెనీకి ఈ ఆర్థిక నష్టం పెద్దది కాకపోవచ్చు. కానీ, ఈ కేసు కంపెనీ ప్రతిష్ఠపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. మేధో సంపత్తి, పోటీ విధానాలు, ఖాతాదారుల నమ్మకం వంటి సున్నితమైన అంశాలతో ముడిపడి ఉన్న ఈ కేసులో ప్రతికూల తీర్పు రావడం భారత ఐటీ పరిశ్రమలో చర్చనీయాంశంగా మారింది. నమ్మకం, పారదర్శకత పునాదులపై ప్రపంచవ్యాప్తంగా కీర్తి గడించిన భారత ఐటీ దిగ్గజం, అమెరికా కోర్టులో ట్రేడ్ సీక్రెట్స్ దొంగతనం ఆరోపణలపై దోషిగా నిలబడటం అరుదైన సంఘటన. సుప్రీంకోర్టు జోక్యానికి నిరాకరించడంతో ఈ ప్రతికూల తీర్పు ఇక టీసీఎస్ ఖాతాలో శాశ్వతంగా నిలిచిపోతుంది.

## 2.3 కోట్లు దాటిన ఢిల్లీ జనాభా

**15 ఏళ్లలో 37.5 శాతం వృద్ధి నమోదు**

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీ జనాభా అనూహ్యంగా పెరిగింది. జనగణన 2027లో భాగంగా నిర్వహించిన తొలి దశ సర్వేలో ఢిల్లీ జనాభా 2.3 కోట్లు దాటినట్టు ప్రాథమికంగా తేలింది. 2011 జనాభా లెక్కల ప్రకారం 1.7 కోట్లుగా ఉన్న జనాభా, గత 15 ఏళ్లలో సుమారు 37.5 శాతం పెరగడం గమనార్హం. సెన్సస్ 2027లో భాగంగా చేపట్టిన 'హౌస్ లిస్టింగ్, హౌసింగ్ సెన్సస్' తొలి దశ ప్రక్రియ ఏప్రిల్ 1న ప్రారంభమై జూన్ 14న ముగిసింది. ఈ సందర్భంగా అధికారులు ఢిల్లీలోని 45,863 బ్లాకులలో పర్యటించి దాదాపు 76 లక్షల ఇళ్లు, 55 లక్షల కుటుంబాల వివరాలను నమోదు చేశారు. ఈ వివరాల ఆధారంగా జనాభాను ప్రాథమికంగా అంచనా వేశారు. అయితే, ఈ గణాంకాలు తాత్కాలికమైనవేనని అధికారులు స్పష్టం చేశారు. 2027 ఫిబ్రవరిలో చేపట్టనున్న రెండో దశ 'జనాభా లెక్కింపు' తర్వాతే తుది జనాభా సంఖ్యను ఖరారు చేస్తారు. రెండో దశలో ప్రజల సామాజిక, ఆర్థిక వివరాలను సేకరించనున్నారు. జిల్లా వారీగా చూస్తే, ఈశాన్య ఢిల్లీలో అత్యధికంగా 28 లక్షల జనాభా ఉండగా, నైరుతి ఢిల్లీలో 25 లక్షల మంది నివసిస్తున్నారు. అత్యల్పంగా న్యూఢిల్లీ జిల్లాలో కేవలం 2 లక్షల జనాభా నమోదైంది. 2026 మధ్య నాటికి ఢిల్లీ జనాభా సుమారు 2.3 కోట్లకు చేరుకుంటుందని గతంలో వచ్చిన అంచనాలకు, తాజా గణాంకాలు దగ్గరగా ఉండటం విశేషం.

## సువేందు ఎన్నిక చెల్లదు!

**హైకోర్టుకు మమత బెనర్జీ**

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మరోసారి న్యాయపోరాటానికి దిగారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భవానీపూర్ నియోజకవర్గ ఫలితాన్ని సవాల్ చేస్తూ ఆమె మంగళవారం కలకత్తా హైకోర్టులో ఎన్నికల పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను ధృవీకరించేందుకు మమత స్వయంగా హైకోర్టు రిజిస్ట్రీకి హాజరైనట్లు సమాచారం. ఇటీవల జరిగిన ఎన్నికల్లో భవానీపూర్ నియోజకవర్గంలో బీజేపీ నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి సువేందు అధికారి చేతిలో మమతా బెనర్జీ 15,015 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. ఒకప్పుడు టీఎంసీకి కంచుకోటగా ఉన్న ఈ స్థానంలో ఓడిపోవడాన్ని ఆమె జీర్ణించుకోలేక పోతున్నారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో అక్రమాలు జరిగాయని, ఫలితాలపై న్యాయవిచారణ జరపాలని ఆమె తన పిటిషన్‌లో కోరారు. ఎన్నికలకు సంబంధించిన రికార్డులను భద్రపరచాలని కూడా విజ్ఞప్తి చేశారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ మెజారిటీ సాధించి, సువేందు అధికారి నేతృత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.

## ఢిల్లీలో భారీ ఉగ్రకుట్ర భగ్నం

**పాక్‌తో లింకులున్న ఏడుగురి అరెస్ట్**



న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో భారీ ఉగ్రకుట్ర భగ్నమైంది. పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ మద్దతుతో కార్యకలాపాలు సాగిస్తున్న ఒక ఉగ్రవాద-నేరపూరిత ముఠా గుట్టును ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ రట్టు చేసింది. ఈ నెట్‌వర్క్‌తో సంబంధం ఉన్న ఏడుగురు సభ్యులను అరెస్టు చేసినట్లు పోలీసులు మంగళవారం వెల్లడించారు. పాకిస్థాన్‌లో తలదాచుకుంటున్న గ్యాంగ్‌స్టర్-టెర్రరిస్ట్ షహజాద్ భట్టి ఆదేశానుసారం ఈ ముఠా పనిచేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. పంజాబ్ సరిహద్దుల మీదుగా పాకిస్థాన్ నుంచి ఆయుధాలు, మందుగుండు సామగ్రి, హెరాయిన్ వంటి మాదక ద్రవ్యాలను ఈ ముఠా ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతానికి అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసులు నిర్ధారించారు. రాజధానిలోని రద్దీ ప్రదేశాలు, కీలక సంస్థలు, మత పెద్దల నివాసాల వద్ద వీరు రెక్కీ నిర్వహించి, వాటికి సంబంధించిన ఫోటోలు, వీడియోలను ఎన్‌క్రిప్టెడ్ యాప్స్ ద్వారా పాకిస్థాన్‌లోని తమ హ్యాండ్లర్లకు పంపినట్లు విచారణలో తేలింది. ఢిల్లీలో మతపరమైన ఉద్రిక్తతలు సృష్టించి, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు పన్నిన ఓ భారీ కుట్రను ఈ అరెస్టులతో అడ్డుకున్నామని అధికారులు తెలిపారు. అరెస్టయిన వారిలో అనాస్ త్యాగి, మోహిత్ అలియాస్ యోగి, ఆరిఫ్ అలియాస్ ప్రధాన్, దీపక్ అగ్రోలా, ఆరిఫ్, కరణ్‌వీర్ సింగ్, జతన్, సబీర్ ఉన్నారు. వీరిలో చాలామందికి నేర చరిత్ర ఉంది. నిందితుల నుంచి 5 సె.మీ. ఆటోమేటిక్ పిస్టళ్లు, 41 సజీవ తూటాలు, పాక్ హ్యాండ్లర్లతో జరిపిన సంభాషణలు ఉన్న 7 మొబైల్ ఫోన్లు, ఒక స్కార్పియో వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పాకిస్థాన్ నుంచి డ్రోన్ల ద్వారా పంజాబ్‌కు చేరిన ఆయుధాలను, అక్కడి నుంచి వారు ఢిల్లీకి తరలిస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. గత మే నెలలో అందిన నిఘా సమాచారంతో పోలీసులు రంగంలోకి దిగారు. టెక్నికల్ సర్వైలెన్స్, మొబైల్ డేటా విశ్లేషణ ద్వారా ఈ నెట్‌వర్క్‌పై నిశితంగా నిఘా పెట్టిన అధికారులు, మంగళవారం ఏకకాలంలో దాడులు నిర్వహించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో తదుపరి విచారణ కొనసాగుతోందని, మరిన్ని అరెస్టులు జరిగే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు.

## రాహుల్‌కు రాజకీయ పరిణతి లేదు: డీఎంకే

చెన్నై: ఒకప్పుడు మిత్రపక్షంగా కలిసి నడిచిన కాంగ్రెస్‌పై డీఎంకే తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. ప్రతిపక్ష ఐక్యత గురించి మాట్లాడే రాహుల్ గాంధీనే దాన్ని దెబ్బతీశారని ఆరోపించింది. డీఎంకే అధికారిక పత్రిక 'మురసోలి' సంపాదకీయంతో పాటు పార్టీ ఐటీ విభాగం కూడా రాహుల్‌పై ఘాటు విమర్శలు గుప్పించింది. రాజకీయంగా కష్టకాలంలో కాంగ్రెస్‌ను భుజాన మోసి నిలబెట్టామని, పరిస్థితులు కాస్త మారగానే ఆ పార్టీ తమను వదిలేసిందని డీఎంకే ఐటీ విభాగం సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. చివర్లో రాహుల్ గాంధీని 'ఓ పెద్ద జోక్'గా అభివర్ణించింది. ప్రతిపక్షాల ఐక్యత గురించి రాహుల్ చేస్తున్న వ్యాఖ్యలు విడ్డూరంగా ఉన్నాయని మురసోలి సంపాదకీయంలో పేర్కొంది. వివిధ రాష్ట్రాల్లో ప్రతిపక్ష కూటమిలో చీలికలకు కారణమైన వ్యక్తే ఇప్పుడు ఐక్యతపై ఉపన్యాసాలు ఇస్తున్నారని వ్యాఖ్యానించింది. ముఖ్యంగా కేరళలో వామపక్షాలపై రాహుల్ చేసిన విమర్శలను ప్రస్తావిస్తూ, మిత్రపక్షాలనే లక్ష్యంగా చేసుకోవడం కాంగ్రెస్‌కు అలవాటైందని ఆరోపించింది. తమిళనాడులో జరిగిన రాజకీయ పరిణామాలను కూడా సంపాదకీయంలో ప్రస్తావించింది. డీఎంకే కూటమిలో పోటీ చేసి గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తర్వాత విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వంలో చేరడం వెనుక కాంగ్రెస్ అధిష్ఠానం సమ్మతి ఉందని ఆరోపించింది. ఇలాంటి చర్యల తర్వాత కూడా రాహుల్ గాంధీ ప్రతిపక్ష పార్టీలకు ఐక్యతపై హామీలు ఇవ్వడం విశ్వసనీయంగా కనిపించడం లేదని వ్యాఖ్యానించింది. ప్రతిపక్ష కూటమిలో ప్రస్తుతం కనిపిస్తున్న విభేదాలకు ప్రధాన కారణం కాంగ్రెస్ వైఖరేనని మురసోలి ఆరోపించింది. రాహుల్ గాంధీ రాజకీయ అపరిపక్వత, స్థిరమైన వ్యూహం లేకపోవడమే ఇండియా కూటమిలో సమస్యలకు దారితీసిందని విమర్శించింది. అయితే డీఎంకే ఆరోపణలను కాంగ్రెస్ వర్గాలు ఖండించాయి. తమిళనాడులో ప్రజల తీర్పును గౌరవించే నిర్ణయాలు తీసుకున్నామని, డీఎంకే లేదా ఇండియా కూటమిని బలహీనపరిచే చర్యలు చేపట్టలేదని వివరించాయి.

# అమెరికాలో 'భారతీయత-2026' వైభవోత్సవం

## మహర్షుల జ్ఞాన సంపదకు విశిష్ట నివాళి.. సనాతన ధర్మ వైభవానికి ప్రపంచ వేదికపై ప్రతిధ్వని

ఏవాన్ (కనెక్టికట్), అమెరికా: అమెరికాలోని కనెక్టికట్ రాష్ట్రం ఏవాన్ హైస్కూల్ ప్రాంగణంలో జూన్ 13న నిర్వహించిన 'భారతీయత--2026' కార్యక్రమం భారతీయ సంస్కృతి, మహర్షుల జ్ఞాన వారసత్వం, సనాతన ధర్మ విలువలను ప్రపంచ వేదికపై చాటిచెప్పిన సాంస్కృతిక-ఆధ్యాత్మిక మహోత్సవంగా నిలిచింది. సత్సంకల్ప ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో అమెరికాతో పాటు పలు దేశాల నుంచి వచ్చిన 800 మందికిపైగా కళాకారులు, విద్యార్థులు, కుటుంబ సభ్యులు, ప్రేక్షకులు పాల్గొన్నారు. సత్యం, ధర్మం, జ్ఞానం, లోకకల్యాణం వంటి భారతీయ శాశ్వత విలువలను ప్రతిబింబించేలా కార్యక్రమాలు నిర్వహించగా, మాజీ భారత రాయబారి డాక్టర్ మిత్రా వశిష్ఠ ముఖ్య అతిథిగా, న్యూయార్క్ భారత దౌత్య కార్యాలయ ప్రతినిధి సేవాంగ్ గ్యాల్ట్సన్ విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సత్సంకల్ప ఫౌండేషన్ కొత్త లోగోను ఆవిష్కరించడంతో పాటు భారతీయ జ్ఞాన సంపదకు చెందిన 'పరాశర సంహిత' గ్రంథాన్ని విడుదల చేసి ప్రచురణ రంగంలోకి అధికారికంగా అడుగుపెట్టింది. అలాగే సత్సంకల్ప ఫౌండేషన్, సుపథ ఫౌండేషన్ సంయుక్తంగా ప్రొఫెసర్ రాఘవేంద్రన్ రచించిన 'గురుదేవోభవ' గ్రంథాన్ని కూడా ఆవిష్కరించాయి. సద్గురు శ్రీ శివానందమూర్తి ఆశయాల ప్రచారంలో విశేష కృషి చేస్తున్న సుపథ ఫౌండేషన్ ట్రస్టీ కుమారి రాధారాణిని సన్మానించారు. అనంతరం ప్రముఖ ఇంజినీర్, రచయిత డాక్టర్ ఏవీ శ్రీనివాసన్, సాంస్కృతికవేత్త డాక్టర్ కాశీనాథుని ఎం ప్రసాద్, పద్మభూషణ్ పురస్కార గ్రహీత పండిత్ వామదేవ శాస్త్రి (డాక్టర్ డేవిడ్ ఫ్రాలీ)లకు 'శివానంద స్మృతి పురస్కారం' ప్రదానం చేశారు. భరద్వాజ మహర్షి జ్ఞాన కేంద్రం ఈ మహోత్సవానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వైమానిక శాస్త్రం, ఆయుర్వేదం, ధనుర్వేదం, రాజధర్మం వంటి రంగాల్లో భరద్వాజ మహర్షి చేసిన కృషిని ఆధునిక దృక్కోణంలో పరిచయం చేయడంతో సందర్శకులు విశేష ఆసక్తి కనబరిచారు. అదే సమయంలో 'సీర్స్ ఆఫ్ భారత్ - భరద్వాజ మహర్షి' నృత్యనాటిక మహర్షి జీవితం, తపస్సు, జ్ఞానసాధనను కళాత్మకంగా ఆవిష్కరించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. డాక్టర్ మిత్రా వశిష్ఠ భారతదేశపు 'సాఫ్ట్ పవర్' ద్వారా ప్రాచీన జ్ఞానాన్ని ఆధునిక ప్రపంచంతో అనుసంధానించే అవసరాన్ని వివరించగా, సేవాంగ్ గ్యాల్ట్సన్ భారతీయ సాంస్కృతిక వారసత్వ పరిరక్షణలో ఇటువంటి కార్యక్రమాల ప్రాధాన్యాన్ని కొనియాడారు. డాక్టర్ ఏవీ శ్రీనివాసన్ హిందూ ధర్మాచరణలో తన అనుభవాలను పంచుకోగా, పండిత్ వామదేవ శాస్త్రి సద్గురు శ్రీ శివానందమూర్తితో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేస్తూ ఆత్మవిద్యే నిజమైన జ్ఞానానికి మూలమని పేర్కొన్నారు. సత్సంకల్ప ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శ్రీధర్ తాళ్ళపాక మాట్లాడుతూ, సాంకేతికంగా ప్రపంచం అభివృద్ధి చెందినా మానవ జీవితంలో



ఆందోళన, ఒంటరితనం పెరుగుతున్నాయని, మహర్షుల జ్ఞానం నేటి సమాజానికీ మార్గదర్శకమని అన్నారు. ప్రతి ఒక్కరూ ఒక మహర్షి గురించి లోతుగా తెలుసుకోవాలని, కుటుంబ సంప్రదాయాలను ఆచరించి భావితరాలకు అందించాలని పిలుపునిచ్చారు. కనెక్టికట్‌కు చెందిన కుటుంబాలు దేశ విదేశాల నుంచి వచ్చిన అతిథులకు ఆత్మీయ ఆతిథ్యం అందించడంతో 'అతిథిదేవో భవ' భావనకు ప్రత్యక్ష రూపం కనిపించింది. మరో విశేషంగా, భారతీయత-2026 సందేశాన్ని న్యూయార్క్ నగరంలోని ప్రపంచ ప్రసిద్ధ టైమ్స్ స్క్వేర్‌లో ప్రదర్శించడం ద్వారా భారతీయ సంస్కృతి, మహర్షుల జ్ఞాన వారసత్వానికి అంతర్జాతీయ స్థాయిలో విశేష గుర్తింపు లభించింది. కార్యక్రమం ముగింపులో పాల్గొన్నవారు భారతీయత అనేది కేవలం ఒక సాంస్కృతిక ఉత్సవం మాత్రమే కాదని, భారతీయ విలువలు, మహర్షుల జ్ఞానం, సనాతన ధర్మంతో మన అనుబంధాన్ని మరింత బలపరిచే ఆత్మీయ అనుభవమని అభిప్రాయపడ్డారు. వేల ఏళ్ల క్రితం మహర్షులు అందించిన జ్ఞానం నేటికీ సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తోందనే సందేశాన్ని ఈ మహోత్సవం మరోసారి బలంగా చాటిచెప్పింది.



## బాసర-ఐఐఐటీ విద్యార్థులకు ఎమ్మెల్యే సంజయ్ అభినందనలు

**పోరండ్ల పాఠశాల విద్యార్థులతో భేటీ**

జగిత్యాల, జూన్ 16 (ఈవార్తలు): బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన జగిత్యాల మండలం పోరండ్ల పాఠశాల విద్యార్థులను జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అభినందించారు. పోరండ్ల ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులు పి. శ్రీవల్లి, పి. గంగోత్రి, పి. దీప్తి బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైన సందర్భంగా వారు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ విద్యార్థులను అభినందించి, భవిష్యత్తులో మరింతగా ఉన్నత విద్యలో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యులు మురళీమనోహర్ చారి, ఉపాధ్యాయురాలు జమున, గ్రామ సర్పంచ్ నక్క హరీశ్, రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## అంగన్వాడీలతో పిల్లల్లో మనో వికాసం

**సర్వాపూర్‌లో అంగన్వాడీ-బాడిబాట కార్యక్రమం**

మల్యాల, జూన్ 16 (ఈవార్తలు): అమ్మ మాట-అంగన్వాడీ బడి బాట కార్యక్రమంలో భాగంగా సర్వపూర్ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాల్లో మంగళవారం ప్రీస్కూల్ మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల తల్లులకు ప్రీస్కూల్ విద్య ప్రాధాన్యం, పిల్లల శారీరక-మానసిక వికాసానికి తోడ్పడే ఆటలు, కథలు, పాటలు, మంచి అలవాట్లు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందిస్తున్న అంగన్వాడీ సేవలను ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 3 నుంచి 6 సంవత్సరాల వయస్సు గల పిల్లలను తప్పనిసరిగా అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని తల్లిదండ్రులను కోరారు. పిల్లలకు విద్యా, వినోద ఆటబొమ్మలను ప్రదర్శించి, వాటి ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జంగిలి హనుమంతు, వార్డు సభ్యులు, తల్లులు, అంగన్వాడీ టీచర్లు శాంత, మధుమతి, సూపర్‌వైజర్ షమీమ్ సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తులు

హైదరాబాద్, జూన్ 16: నేషనల్ అకాడమీ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో దేశీయ, అంతర్జాతీయ స్థాయిలో డిమాండ్ ఉన్న సైబర్ సెక్యూరిటీ కోర్సులకు తెలంగాణ వ్యాప్తంగా ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అకాడమీ డైరెక్టర్ విమలా రెడ్డి తెలిపారు. ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్ డిప్లొమా, ఇంజినీరింగ్ చదువుతున్న లేదా పూర్తి చేసిన విద్యార్థులు ఈ కోర్సులకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని పేర్కొన్నారు. సైబర్ సెక్యూరిటీ ఆఫీసర్, డిప్లొమా ఇన్ సైబర్ సెక్యూరిటీ అండ్ ఎథికల్ హ్యాకింగ్, పీజీ డిప్లొమా ఇన్ సైబర్ సెక్యూరిటీ అండ్ ఎథికల్ హ్యాకింగ్, మాస్టర్ ప్రోగ్రామ్ ఇన్ సైబర్ సెక్యూరిటీ అండ్ ఎథికల్ హ్యాకింగ్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని, శిక్షణ కాలం 5 నుంచి 10 నెలల వరకు ఉంటుందని, శిక్షణ పూర్తయిన అనంతరం కేంద్ర ప్రభుత్వ సంస్థ ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. సైబర్ సెక్యూరిటీ కోర్సులు పూర్తి చేసిన వారికి సాఫ్ట్‌వేర్, ఐటీ, బ్యాంకింగ్, ఫైనాన్స్, హెల్త్‌కేర్, రిటైల్, ఈ-కామర్స్, విద్యా రంగాల్లో ఉపాధి అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా సైబర్ సెక్యూరిటీ ఆఫీసర్, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ అనలిస్ట్, పెనెట్రేషన్ టెస్టర్, సెక్యూరిటీ ఆర్కిటెక్ట్, ఐటీ సెక్యూరిటీ ఇంజనీర్, సెక్యూరిటీ సిస్టమ్స్ అడ్మినిస్ట్రేటర్, ట్రైనర్ వంటి ఉద్యోగాల్లో అవకాశాలు లభించే వీలుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 7893141797 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## ఎస్ఐఆర్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్‌కు దావ వసంత వినతి**

జగిత్యాల, జూన్ 16 (ఈవార్తలు): ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)పై జిల్లా వ్యాప్తంగా ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించాలని మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్ఐఆర్‌కు సంబంధించిన అంశాలపై గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజల్లో పూర్తి స్థాయి అవగాహన లేకపోవడంతో అనేక అపోహలు, సందేహాలు నెలకొంటున్నాయని పేర్కొన్నారు. కొత్త అర్హులైన ఓటర్లను జాబితాలో చేర్చడం, ఓటరు జాబితాలోని తప్పులను సరిదిద్దడం, మరణించిన లేదా అనర్హులైన వ్యక్తుల పేర్లను తొలగించడం ఎస్ఐఆర్ ప్రధాన ఉద్దేశమని వివరించారు. జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక సమావేశాలు, అవగాహన సదస్సులు నిర్వహించి ఎస్ఐఆర్ ఉద్దేశం, విధివిధానాలు, ప్రయోజనాలు, ప్రజలు అనుసరించాల్సిన ప్రక్రియపై స్పష్టత కల్పించాలని కోరారు. దీనివల్ల ప్రజలకు సరైన సమాచారం అందడమే కాకుండా ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాల అమలులో మరింత భాగస్వామ్యం పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ తాటిపర్తి విజయలక్ష్మి, నాయకులు వెంకటేశ్వరరావు, ఆనందరావు, తుమ్మ గంగాధర్, మాజీ కౌన్సిలర్లు గాజుల రాజేందర్, కల్లెపెల్లి దుర్గయ్య, మాజీ సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

## ధర్మాజీపేటలో పల్లె దవాఖాన ప్రారంభం

జగిత్యాల, జూన్ 16 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా ధర్మాజీపేట గ్రామంలో రూ.23 లక్షల నిధులతో చేపడుతున్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (పల్లె దవాఖాన)ను ఎంపీ ధర్మపురి అరవింద్, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం పల్లె దవాఖానలను ఏర్పాటు చేస్తోందన్నారు. ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనబట్ల దినేష్, ఆత్మ చైర్మన్ కాటిపెల్లి గంగారెడ్డి, సర్పంచ్ గంగారెడ్డి, చైర్మన్ ఏనుగు ముత్యం రెడ్డి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుజాత, తహసీల్దార్ నాగార్జున, ఎంపీడీవో చిరంజీవి, డీఈ మిలింద్, బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి బోగ శ్రావణి, మండల నాయకులు కోల శ్రీనివాస్, రవీందర్‌రావు, మోర హన్మాండ్లు, సంధ్యారాణి, సురేందర్ నాయక్, అచ్యుతరావు, ఏనుగు మల్లారెడ్డి, మారంపల్లి స్నేహలత-హరీష్, వెంకటేష్, పల్లికొండ గంగారాజం, మొకిద్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## పహాణి పత్రాల్లో గుడాల అమ్మకాలు!

**మల్యాలలో వెలుగుచూసిన విచిత్ర ఘటన**

**చిత్తు కాగితాలుగా వ్యవసాయ రికార్డులు**

**విచారణకు గ్రామస్థుల డిమాండ్**



మల్యాల, జూన్ 16 (ఈవార్తలు): సాధారణంగా వ్యవసాయ భూముల యాజమాన్యం, సర్వే నంబర్లు, పంటల వివరాలు, భూ విస్తీర్ణం వంటి అంశాలను నమోదు చేసే పహాణి పత్రాలు ప్రభుత్వ రెవెన్యూ రికార్డుల్లో కీలకమైనవి. అలాంటి అధికారిక పత్రాలను గుడాల అమ్మకాల కోసం వినియోగించిన ఘటన జగిత్యాల జిల్లా మల్యాల మండలంలో చర్చనీయాంశంగా మారింది. స్థానికంగా ఓ దుకాణంలో గుడాలు విక్రయించిన సందర్భంగా, ఆ కాగితాలు ఎక్కడివని ఆరా తీయగా ఎక్కడో దొరికినట్లు సదరు దుకాణాదారుడు పొంతనలేని సమాధానమిచ్చాడు. సాధారణంగా పహాణి పత్రాలు రెవెన్యూ శాఖ జారీ చేసే అధికారిక భూ రికార్డులు కావడంతో, అవి చిత్తు కాగితాల్లా ఎలా వినియోగంలోకి వచ్చాయనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అధికారిక పత్రాలు ఎలా బయటకు వచ్చాయి? అవి నిజమైన పహాణి కాపీలా? లేక పాత రికార్డులా? అని ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ భూ రికార్డులను నిర్లక్ష్యంగా వినియోగిస్తున్నారా? అన్న కోణంలోనూ అనుమానిస్తున్నారు. ఈ వ్యవహారంపై రెవెన్యూ శాఖ అధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలికితీయాలని కోరుతున్నారు. అధికారిక పత్రాల దుర్వినియోగం జరిగి ఉంటే బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటన మల్యాల మండలంలో చర్చకు దారితీయగా, ప్రభుత్వ రికార్డుల భద్రత, నిర్వహణ, వినియోగంపై మరింత అప్రమత్తత అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## ఎమ్మెల్యేను దించేదాకా నిద్రపోను: అర్వింద్




జగిత్యాల, జూన్ 16 (ఈవార్తలు): అమృత్2 పథకం కింద జగిత్యాలకు రూ.38.5 కోట్లు, రాయికల్‌కు రూ.15 కోట్లు మంజూరయ్యాయని, అయితే రాయికల్‌లో పనులు ఇప్పటికీ ప్రారంభం కాకపోవడం ఆందోళన కలిగిస్తోందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. జగిత్యాల పర్యటనలో భాగంగా ఆయన మాట్లాడుతూ, రాయికల్ అమృత్ కాంట్రాక్టును సీఎం సన్నిహితుడికి చెందిన డమ్మీ కంపెనీకి అప్పగించారని ఆరోపించారు. కమిషన్ల కోసమే డమ్మీ కంపెనీలకు పనులు కట్టబెడుతున్నారని, సబ్ కాంట్రాక్టు ఇచ్చినప్పటికీ రాయికల్‌లో ఇప్పటివరకు ఒక్క పని కూడా ప్రారంభం కాలేదని విమర్శించారు. అమృత్ పథకం నిధులు ఎటు వెళ్తున్నాయో ప్రజలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్రీయ విద్యాలయానికి కేటాయించిన స్థలాన్ని కోట్ల రూపాయల లావాదేవీల కోసం ఒక ప్రైవేటు వ్యాపారికి అప్పగించారని ఆరోపించిన ఆయన, ఈ వ్యవహారంలో భారీగా డబ్బులు చేతులు మారాయని వ్యాఖ్యానించారు. స్థానిక ఎమ్మెల్యే కూడా ఇందులో భాగస్వామిగా ఉన్నారని ఆరోపించారు. చల్గల్ గ్రామంలో ఉన్న 10 ఎకరాల ప్రభుత్వ భూమిని వెంటనే కేంద్రీయ విద్యాలయానికి కేటాయించాలని ఎంపీ అర్వింద్ కోరారు. జగిత్యాల అభివృద్ధి అంశాల్లో ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తానని, ప్రస్తుత ఎమ్మెల్యేకు 'మాజీ ఎమ్మెల్యే' అనే పేరు వచ్చే వరకు తాను నిద్రపోనని వ్యాఖ్యానించారు.




## విద్యార్థుల సంక్షేమమే లక్ష్యం


**బ్రేక్‌ఫాస్ట్ విత్ మిల్క్ ప్రారంభోత్సవంలో మోతె శ్రీలత శోభన్ రెడ్డి**

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 16 (ఈవార్తలు): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "బడిబాట" కార్యక్రమంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అమలు చేస్తున్న "బ్రేక్‌ఫాస్ట్ విత్ మిల్క్" పథకం ప్రారంభోత్సవ కార్యక్రమం ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, జామా ఉస్మానియాలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రేటర్ హైదరాబాద్ మాజీ డిప్యూటీ మేయర్ శ్రీమతి మోతే శ్రీలత శోభన్ రెడ్డి హాజరై విద్యార్థులకు అల్పాహారం, పాలు పంపిణీ చేసి పథకాన్ని ప్రారంభించారు. అనంతరం యంగ్ ఇండియా స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీమతి మోతే శ్రీలత శోభన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల ఆరోగ్యం మరియు విద్యా ప్రమాణాల పెంపు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. చిన్నారులు పోషకాహార లోపం లేకుండా ఆరోగ్యంగా చదువుకోవడానికి ఈ అల్పాహార పథకం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. అదేవిధంగా, విద్యార్థులే దేశ భవిష్యత్తు అని పేర్కొంటూ, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## అవసరమైతే కాంగ్రెస్‌లో చేరుతా

**ఎంపీ అర్వింద్‌కు సంజయ్ కౌంటర్**

రాయికల్, జూన్ 16 (ఈవార్తలు): అభివృద్ధి కార్యక్రమానికి హాజరై రాజకీయ అంశాలు ప్రస్తావించి, సభ మధ్యలో వెళ్లిపోవడం సరైన పద్ధతి కాదని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. పదవులు శాశ్వతం కాదని, ప్రజాసేవే ముఖ్యమని పేర్కొన్నారు. మంగళవారం రాయికల్ మండలం ధర్మాజిపేటలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం ప్రారంభోత్సవం అనంతరం జరిగిన సభలో ఎంపీ అరవింద్, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ అరవింద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పల్లె దవాఖాన నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేయగా, రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.3 లక్షలు మాత్రమే ఇచ్చిందని పేర్కొన్నారు. అనంతరం సభ నుంచి వెళ్లిపోయారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ కేంద్రం విడుదల చేసే నిధులు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించే పన్నుల ద్వారానే సమకూరుతాయని అన్నారు. రాష్ట్రాల నుంచి పన్నులు వెళ్లకపోతే కేంద్రానికి నిధులు ఎక్కడి నుంచి వస్తాయని ప్రశ్నించారు. తాను కాంగ్రెస్‌తో కలిసి పనిచేస్తున్నానని, కాంగ్రెస్ ఎమ్మెల్యేనని విమర్శిస్తున్నారని, అవసరమైతే కాంగ్రెస్ సభ్యత్వం కూడా తీసుకుంటాననంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. రాష్ట్రాలకు మరింత న్యాయమైన వాటా ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఎంపీ కోసం గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు రెండు గంటలపాటు వేచి ఉన్నారని, వారి వినతులను స్వీకరించకుండా వెళ్లిపోవడం బాధాకరమన్నారు. బీజేపీ నాయకులు రెచ్చగొట్టేలా నినాదాలు చేశారని ఆరోపించారు. వడ్లు, మక్కల కొనుగోలు విషయంలో కేంద్రం విఫలమైందని, రైతు సమస్యలపై స్పందించాలని డిమాండ్ చేశారు. కేంద్రం యూరియా కోత విధించడం వల్లే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాల్సి వచ్చిందన్నారు. జగిత్యాల నియోజకవర్గానికి 14 పల్లె దవాఖానలు మంజూరు చేశామని, ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో లైబ్రరీ చైర్మన్ సంగనబట్ల దినేష్, ఆత్మ చైర్మన్ కాటిపెల్లి గంగారెడ్డి, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.





## జగిత్యాల మున్సిపాలిటీలో మళ్లీ డీజిల్ స్కాం?

**నిధుల వినియోగంపై వివరాలెక్కడ?**

**కలెక్టర్‌కు హనుమండ్ల జయశ్రీ ఫిర్యాదు**

జగిత్యాల, జూన్ 16 (ఈవార్తలు): జగిత్యాల మున్సిపాలిటీలోని కొన్ని విభాగాల నిర్వహణ, నిధుల వినియోగం, సిబ్బంది నియామకాలపై పారదర్శకత లోపించిందని ఆరోపిస్తూ, వెంటనే చర్యలు తీసుకోవాలని మాజీ కౌన్సిలర్ హనుమండ్ల జయశ్రీ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కొత్త కౌన్సిల్ ఏర్పడిన తర్వాత 30-05-2026న జరిగిన ఎజెండాలో మార్చి, ఏప్రిల్ ఆదాయ-వ్యయ వివరాలు మాత్రమే ఇవ్వడం జరిగిందని, ఫిబ్రవరి నెల వివరాలు ఇవ్వలేదని ఆమె పేర్కొన్నారు. ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నందున ఫిబ్రవరి నెల ఆదాయ--వ్యయ వివరాలను నోటీసు బోర్డులో ఉంచి ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరారు. అదేవిధంగా శానిటేషన్ విభాగంలో డీజిల్ వ్యయాలు ప్రతి నెల పెంచి చూపుతున్నట్లు అనుమానాలు ఉన్నాయని, గతంలో కూడా డీజిల్ కుంభకోణంపై ఫిర్యాదులు చేసిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు. ఈసారి అలాంటి అక్రమాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపాలిటీలో గ్రీన్ బడ్జెట్ కింద 'హరితహారం' కార్మికులను మెప్మా ద్వారా నియమించేందుకు తీసుకున్న నిర్ణయంపై కూడా ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. నియామకాల వివరాలు స్పష్టంగా లేకపోవడం, ఎంత మంది, ఎంత జీతం అన్న సమాచారం లేకపోవడం ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. టౌన్ లెవల్ ఫెడరేషన్ ద్వారా డ్రైవర్లు, లేబర్ల నియామకాలు చేపట్టే ప్రతిపాదనపై కూడా ఆమె సందేహాలు వ్యక్తం చేశారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని నిధుల దుర్వినియోగానికి అవకాశం లేకుండా టెండర్ విధానంలో పారదర్శకంగా నియామకాలు చేపట్టాలని కోరారు. మున్సిపల్ ఆదాయం, ప్రజాధనం దుర్వినియోగం కాకుండా పూర్తి పారదర్శక ప్రక్రియ అమలు చేయాలని పట్టణ ప్రజల తరఫున కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసినట్లు హనుమండ్ల జయశ్రీ తన లేఖలో పేర్కొన్నారు.

## కొండగట్టు అంజన్న సేవలో ఏపీ ఎమ్మెల్సీ రహుల్లా

మల్యాల, జూన్ 16 (ఈవార్తలు): మల్యాల మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానాన్ని విజయవాడ ఎమ్మెల్సీ ఎండి రహుల్ల మంగళవారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు దేవస్థాన అధికారులు, అర్చకులు ఆలయ సంప్రదాయం ప్రకారం ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్సీ రహుల్ల స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కుటుంబ సభ్యులతో కలిసి దర్శన భాగ్యం పొందారు. ఆలయ ప్రధాన అర్చకులు జితేందర్ స్వామి వేదమంత్రోచ్చారణల మధ్య ఆశీర్వచనం అందజేసి, స్వామివారి తీర్థప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన టెంపుల్ సూపరింటెండెంట్ ఉపాధ్యాయుల చంద్రశేఖర్‌తో పాటు ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## వయ్యారి చిత్రం


సీరత్ కపూర్



# నంది అవార్డులు ఇస్తారా..!

## విజయవాడలో ఏపీ చలనచిత్ర బోర్డు భేటీ

ఆంధ్రప్రదేశ్ చలనచిత్ర, టెలివిజన్ మరియు నాటకరంగ అభివృద్ధి సంస్థ తన పాలకమండలి తొలి సమావేశం విజయవాడలో నిర్వహించారు. ఈ సమావేశానికి కార్పొరేషన్ చైర్మన్ పి. భరత్ భూషణ్ అధ్యక్షత వహించగా, మేనేజింగ్ డైరెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్ పాల్గొని వివరాలను వెల్లడించారు. ఈ ప్రతిష్టాత్మక సమావేశంలో బోర్డు డైరెక్టర్లుగా ఉన్న ప్రముఖ నటుడు సుమన్ తల్వార్, ఎస్. శివాజీ, బుర్రా సాయిమాధవ్, చదలవాడ శ్రీనివాసరావు, వివేక్ కూచిభొట్ల, వి. సముద్ర, వై. ఝాన్సీ, కందిమల్ల సాంబశివరావు, కె. ఉమామహేశ్వరరావు, ఎస్. వెంకట కృష్ణారెడ్డి, జి. రాజ్ వెంకటేశ్వర యాదవ్, డి. సత్యనారాయణ, దుర్గాప్రసాద్ సాహు తదితరులు హాజరయ్యారు. రాష్ట్రంలో చలనచిత్ర, టెలివిజన్ మరియు నాటక రంగాల సమగ్ర అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై ఈ సమావేశంలో సభ్యులు విస్తృతంగా చర్చించినట్లు తెలుస్తుంది. ఇందులో భాగంగా కార్పొరేషన్ వైస్ చైర్మన్‌గా చిక్కాల మెహర్ రమేష్ కుమార్‌ను నియమించే ప్రక్రియను బోర్డు పూర్తి చేసింది. అనంతరం జరిగిన జనరల్ మీటింగ్ లో తీసుకున్న నిర్ణయాలను ప్రభుత్వ ఆమోదం కోసం పంపేలా ఖరారు చేశారు. ఆంధ్రప్రదేశ్ వినోద రంగాన్ని బలోపేతం చేయడం కోసం మౌలిక సదుపాయాల కల్పన, పెట్టుబడుల ప్రోత్సాహం, సినిమా షూటింగ్‌లకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించడం మరియు పరిశ్రమ వృద్ధికి ఒక సమగ్ర రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేయడం వంటి కీలక అంశాలపై బోర్డు సుదీర్ఘంగా చర్చించింది. తెలుగు సినీ రంగానికి అత్యంత ప్రతిష్టాత్మకమైన 'నంది అవార్డుల' అంశంపై ఈ సమావేశంలో ప్రత్యేక చర్చలు జరిగాయి. గతంలో ప్రకటించిన అవార్డులతో పాటు, భవిష్యత్తులో నిర్వహించబోయే నంది అవార్డుల వేడుకల యొక్క రూపకల్పన, విధానాలు మరియు సిఫార్సులకు సంబంధించిన పలు అంశాలను సభ్యులు సమీక్షించారు. ఏపీలో చిత్ర పరిశ్రమను మరింత బలోపేతం చేస్తూ, కళాకారులకు, సాంకేతిక నిపుణులకు మరియు నిర్మాతలకు కార్పొరేషన్ ద్వారా పూర్తి మద్దతు అందిస్తామని బోర్డు సభ్యులు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఏపీ చలనచిత్ర అభివృద్ధి సంస్థ జనరల్ మేనేజర్ ముదావత్ శ్రీనివాస్ నాయక్‌తో పాటు కార్పొరేషన్ ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# పృథ్వీరాజ్‌తో కరణ్ జోహార్ మువీ

బాలీవుడ్ స్టార్ నిర్మాత కరణ్ జోహార్‌కు చెందిన ధర్మ ప్రొడక్షన్స్, మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్‌కు చెందిన పృథ్వీరాజ్ ప్రొడక్షన్స్ కలిసి ఒక భారీ మలయాళ చిత్రాన్ని ప్రకటించాయి. 19వ శతాబ్దపు కేరళ జానపద కథలు, సాంస్కృతిక గాథల ఆధారంగా 'ఓడియన్: ది ఏజ్ ఆఫ్ ఇల్యూజన్' పేరుతో రాబోతుంది. తాజాగా, ఈ ప్రాజెక్ట్ గురించి కరణ్ జోహార్ సోషల్ మీడియాలో ఓ ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. తాము



ధర్మ ప్రొడక్షన్స్ తరపున మలయాళ ఇండస్ట్రీలోకి అడుగుపెడుతున్నందుకు చాలా గర్వంగా ఉందని తెలిపారు. పృథ్వీరాజ్ ప్రొడక్షన్స్‌తో తమకు ఇప్పటికే ఎన్నో విజయవంతమైన కొల్లాబరేషన్స్ ఉన్నాయని, భవిష్యత్తులో మరిన్ని ప్రాజెక్ట్స్ చేయబోతున్నామని చెప్పారు. ఈ తరం సినిమాలో జానపద కథలను ఎంతో భయంకరంగా, ఆసక్తికరంగా తెరకెక్కించడంలో దర్శకుడు రాహుల్ సదాశివన్‌కు ఒక ప్రత్యేకమైన శైలి ఉందని కరణ్ జోహార్ ప్రశంసించారు. ఈ బలమైన జానపద ఇతిహాసాన్ని వెండితెరపై ఆవిష్కరించడానికి అద్భుతమైన నటి మంజు వారియర్, తమకు ఎంతో ఇష్టమైన పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారని, ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతుందని ఆయన వెల్లడించారు. అయితే ధర్మ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న మొట్టమొదటి మలయాళ చిత్రం ఇదే కావడం విశేషం. కేరళ పురాణాల్లోని రూపం మార్చుకునే ఓ మాయా శక్తి, ఒక బలమైన మాతృస్వామ్య కుటుంబంపై విరుచుకుపడటం.. ఆ తర్వాత సత్యం, భ్రమల మధ్య జరిగే భీకర పోరాటం చుట్టూ ఈ కథ సాగనుందని టాక్.

# ఐదేళ్లు కష్టపడ్డా పైసలివ్వలే

టాలీవుడ్ యంగ్ హీరోయిన్ చాందిని చౌదరి మొదట షార్ట్ ఫిల్మ్స్ ద్వారా ఫేమ్ రాబట్టుకున్నారు. ఇక నటనపై ఆసక్తితో 'కేటుగాడు' మూవీతో టాలీవుడ్ ఇండస్ట్రీకి వచ్చి.. తెలుగులో ఎన్నో చిత్రాల్లో నటించినప్పటికీ, నేషనల్ అవార్డ్ విన్నింగ్ మూవీ 'కలర్ ఫోటో' తో దేశవ్యాప్తంగా భారీ పాపులారిటీని సొంతం చేసుకున్నారు. గత ఏడాది విడుదలైన 'సంతాన ప్రాప్తి రస్తు' సినిమాతో ప్రేక్షకులను అలరించిన ఈ ముద్దుగుమ్మ, ప్రస్తుతం కొత్త ప్రాజెక్ట్‌లపై దృష్టి పెడుతూనే సోషల్ మీడియాలో ఎంతో యాక్టివ్‌గా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా చాందిని ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన ఒక పోస్ట్ సోషల్ మీడియాలో తీవ్ర దుమారం రేపుతోంది. "పరిశ్రమలో మోడల్స్, ఆర్టిస్టులు తాము కష్టపడి చేసిన పనికి రావాల్సిన సొంత డబ్బుల కోసం నెలల తరబడి వేచి చూడాల్సి రావడం నిజంగా చాలా దారుణం. ఈ బాధ ఎలా ఉంటుందో నాకూ తెలుసు, ఎందుకంటే ప్రస్తుతం నేను కూడా సరిగ్గా ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నాను. నేను నటించిన ఒక సినిమాకు సంబంధించి నాకు రావాల్సిన రెమ్యునరేషన్ డబ్బులను ఇంతవరకు ఇవ్వలేదు. గత రెండేళ్లుగా నా సొంత డబ్బుల కోసం నేను వాళ్ల చుట్టూ తిరుగుతూనే ఉన్నాను, ఎదురుచూస్తూనే ఉన్నాను. ఆ ఒక్క సినిమా కోసం దాదాపు నేను ఐదేళ్ల పాటు కష్టపడ్డాను. కానీ చివరికి మూవీ అయిపోయాక వాళ్లు నన్ను కనీసం పట్టించుకోవడం లేదు, నా డబ్బులు నాకు ఇవ్వకుండా వదిలేశారు" అని రాసుకొచ్చింది. ఇక ఈ పోస్ట్ నెట్టింట దుమారం రేపుతోంది. ప్రస్తుతం చాందిని చేసిన ఈ వ్యాఖ్యలతో నెట్టింట ఒక ఆసక్తికరమైన చర్చ మొదలైంది. చాందిని చౌదరి తన కెరీర్‌లో ఐదేళ్ల పాటు వర్క్ చేసిన సినిమా ఏదైనా ఉందంటే.. అది మాస్ కా దాస్ విశ్వక్ సేన్ హీరోగా వచ్చిన 'గామి' అని నెటిజన్లు అనుమానిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ చాలా ఏళ్ల పాటు సాగిందని.. పైగా ఈ చిత్రం విడుదలై కూడా దాదాపు రెండేళ్లు అవుతుండటంతో.. చాందిని చౌదరి ఆరోపిస్తున్నది.



# స్మృతి మంధాన బయోపిక్‌లో అనీత్ పడ్డా!

వరుస చిత్రాలతో ఫుల్ జోష్‌లో ఉన్న అనీత్ పడ్డాకు స్మృతి మంధాన బయోపిక్‌లో నటించే అవకాశం వచ్చినట్లు నెట్టింట పలు పోస్టులు చక్కర్లు కొడుతున్నాయి. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ సైలెంట్‌గా జరుగుతోందని టాక్. క్రీడా నేపథ్యంతో వచ్చే బయోపిక్‌లకు భారతీయ సినిమాలో ఎప్పుడూ మంచి ఆదరణ ఉంటుంది. ముఖ్యంగా స్మృతి మంధానకు దేశవ్యాప్తంగా పురుషుల క్రికెటర్లతో సమానంగా భారీ ఫాలోయింగ్ ఉంది. మైదానంలో ఆమె సాధించిన రికార్డులు, క్రికెట్ ప్రయాణంలో ఆమె ఎదుర్కొన్న సవాళ్లు, భారత మహిళా క్రికెట్‌ను ప్రపంచ స్థాయిలో నిలబెట్టేందుకు ఆమె చేసిన కృషి వంటి అనేక ఆసక్తికరమైన అంశాలను ఈ సినిమాలో చూపించబోతున్నారట. బాలీవుడ్‌లో ఇటీవలి కాలంలో రాబోతున్న లేడీ ఓరియెంటెడ్ చిత్రాలలో ఇది అత్యంత భారీ చిత్రంగా నిలిచే అవకాశం ఉందని సినీ ప్రియులు భావిస్తున్నారు. క్రికెట్, సినిమా లవర్స్‌ను ఆకట్టుకునేలా రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలోనే అధికారికంగా వెల్లడి కానున్నాయి.





# 'కల్కి-2' లో ఆలియా!

కల్కి 2'లో అలియా భట్ నటించడం దాదాపు ఖాయమైందని టాక్. గత నెలలో హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా రెండవ షెడ్యూల్‌లో అలియా భట్ స్వయంగా పాల్గొన్నట్లు సోషల్ మీడియాలో పలు పోస్టులు వైరల్ అవుతున్నాయి. అక్కడ ఆమెపై దాదాపు ఐదు రోజుల పాటు కొన్ని కీలకమైన సన్నివేశాలను చిత్రబృందం సైలెంట్‌గా చిత్రీకరించిందని టాక్. ఈ సినిమాలో ఆమె క్యారెక్టర్ చాలా పవర్‌ఫుల్‌గా, కథను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లే విధంగా ఉండబోతోందని తెలుస్తోంది.. అయితే, మొదట్లో ఈ చిత్రంలో దీపికా పదుకోణె స్థానంలో సుమతి పాత్ర కోసం ఆలియా భట్‌ను అనుకుంటున్నట్లు వార్తలు వచ్చినప్పటికీ.. తాజా లీకుల ప్రకారం ఆమె సుమతి పాత్ర చేయడం లేదని తెలుస్తోంది. ఆలియా భట్ కోసం దర్శకుడు నాగ్ అశ్విన్ అత్యంత కీలకమైన ఒక ప్రత్యేక పాత్రను డిజైన్ చేశారట. ఇందులో నిజమెంత అనేది తెలియనప్పటికీ.. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్టులు మాత్రం నెట్టింట హల్ చల్ చేస్తున్నాయి. దీనిపై అధికారిక విడుదల కావాల్సి ఉంది. మరోవైపు, సాయిపల్లవిని తీసుకున్నారన్న వార్తలను నాగ్ అశ్విన్ ఖండించారు. సుమతి పాత్ర కోసం సాయి పల్లవిని సంప్రదించారనే వార్తల్లో ఎలాంటి నిజం లేదని ఖండించారు. సినిమాకు సంబంధించిన నటీనటుల వివరాలను, ఇతర అప్‌డేట్స్‌ను సరైన సమయంలో అధికారికంగా వెల్లడిస్తామని తెలిపారు. ఇప్పటికే 'కల్కి-2' చిత్రానికి సంబంధించి రెండు ముఖ్యమైన షెడ్యూల్స్ విజయవంతంగా పూర్తయ్యాయని, ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి సినిమా నాన్‌స్టాప్ షూటింగ్ జరుపుకోనుందని పేర్కొన్నారు.



# ఐదుగురితో సెక్స్ చేశా: విష్ణుప్రియ

ఒక నెటిజన్ విష్ణుప్రియను ఉద్దేశించి 'మీ బాడీ కౌంట్ ఎంత?' (అంటే ఇప్పటివరకు ఎంతమందితో శృంగారంలో పాల్గొన్నారు?) అంటూ బోల్డ్ ప్రశ్నను అడిగారు. సాధారణంగా సెలబ్రిటీలు ఇటువంటి అసభ్యకరమైన లేదా వ్యక్తిగత ప్రశ్నలు ఎదురైనప్పుడు వాటిని స్కిప్ చేస్తారు లేదా సదరు నెటిజన్‌పై మండిపడతారు. కానీ విష్ణుప్రియ మాత్రం అస్సలు వెనకడుగు వేయకుండా, ఎంతో ఓపెన్‌గా సమాధానం ఇచ్చి అందరినీ షాక్‌కు గురి చేశారు. తాను ఇప్పటివరకు ఐదుగురితో సెక్స్ చేసినట్లు ఆమె ఏమాత్రం మొహమాటం లేకుండా లైవ్‌లోనే సమాధానం ఇచ్చారు.





# నాలుగేళ్ల తర్వాత
# సెరెనా రీ ఎంట్రీ

సోదరి వీనస్‌తో కలిసి వింబుల్డన్ డబుల్స్

**దాదాపు నాలుగేళ్ల విరామం తర్వాత అమెరికా టెన్నిస్ దిగ్గజం సెరీనా విలియమ్స్ రీఎంట్రీ ఇచ్చింది. సోదరి వీనస్ విలియమ్స్‌తో కలిసి త్వరలో వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో బరిలోకి దిగనుంది. టెన్నిస్ ప్రపంచంలో అత్యంత విజయవంతమైన జోడీల్లో ఒకటైన విలియ-మ్స్ సిస్టర్స్ మరోసారి గ్రాండ్‌స్లామ్ వేదికపై సందడి చేయనున్నారు.**

మంగళవారం విడుదలైన మహిళల డబుల్స్ వైల్డ్ కార్డ్ జాబితాలో సెరీనా-వీనస్ జోడీకి చోటుదక్కింది. సెరీనా విలియమ్స్ 2022 యూఎస్ ఓపెన్ తర్వాత గ్రాండ్‌స్లామ్ టోర్నీల నుంచి విరామం తీసుకుంది. ఇటీవలే క్వీన్స్ క్లబ్ ఛాంపియన్‌షిప్‌లో కెనడాకు చెందిన విక్టోరియా మెంబోకోతో కలిసి రీఎంట్రీ ఇచ్చింది. అయితే భాగస్వామి గాయపడటంతో ఆ జోడీ టోర్నీలో ఎక్కువరోజులు కొనసాగలేకపోయింది. కాగా వింబుల్డన్‌కు ముందు బెర్లిన్ ఓపెన్‌లో కరోలినా ముచోవాతో కలిసి సెరెనా ఆడనుంది. టెన్నిస్ చరిత్రలో విలియమ్స్ సిస్టర్స్ జోడీకి ప్రత్యేక స్థానం ఉంది. ఆస్ట్రేలియన్ ఓపెన్, ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్, యూఎస్ ఓపెన్‌లలో కలిసి పోటీ పడి అద్భుత విజయాలు సాధించారు. మహిళల డబుల్స్‌లో ఏకంగా 14 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు గెలుచుకున్నారు. అయితే వీరిద్దరూ కలిసి ఆడిన 14 మ్యాచ్‌లలో అన్నింట్లోనూ విజేతలుగా నిలవడం విశేషం. సెరెనా శక్తివంతమైన బేస్ లైన్ ఆట, వీనస్ ఆల్‌రౌండ్ నైపుణ్యంతో ప్రత్యర్థులకు ఎన్నోసార్లు చుక్కలు చూపించారు. ఇప్పుడు మరోసారి ఈ జోడీ వింబుల్డన్ గ్రాస్ కోర్టులపై కలిసి అడుగుపెట్టనుండటం అభిమానుల్లో ఆసక్తి రేపుతోంది.



## వైభవ్ వివాదం.. స్పందించిన బీసీసీఐ

వైభవ్ సూర్యవంశీ వివాదంపై భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) స్పందించింది. బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా టైమ్స్ ఆఫ్ ఇండియాతో మాట్లాడుతూ.. "ఇండియా- 'ఎ' జట్టు కీలక టోర్నమెంట్ ఆడుతోంది. వర్ధమాన క్రికెటర్లు టీమిండియాలోకి వచ్చేందుకు ఇదొక మంచి అవకాశం. ముక్కోణపు వన్డే సిరీస్ రూపంలో వారికి తమను తాము నిరూపించుకునే అవకాశం దొరికింది. కాబట్టి వాళ్లంతా ఆటపై మాత్రమే దృష్టి పెట్టాలి. ఇతర విషయాలను పట్టించుకోకూడదు. అలా చేస్తే ఏకాగ్రత దెబ్బతింటుంది. అక్కడికి ఎందుకు వెళ్లారో ఆ విషయంపై మాత్రమే దృష్టి పెట్టండి. ప్రతి ఒక్కరు అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వాల్సి ఉంటుంది. తద్వారా ఈ ట్రై సిరీస్‌లో ఇండియా విజేతగా నిలుస్తుంది. మా దృష్టి మొత్తం విజయం మీదే కేంద్రీకృతమై ఉంది. ఆటగాళ్లు అందుకు అనుగుణంగా నడుచుకోవాలి" అని దేవజిత్ సైకియా పరోక్షంగా భారత క్రికెటర్లను హెచ్చరించాడు.

## నేషన్స్ కప్ సెమీఫైనల్లో టీమిండియా

ఎఫ్ఐహెచ్ నేషన్స్ కప్‌లో భారత మహిళల హాకీ జట్టు అజేయంగా దూసుకెళుతోంది. ఆక్లాండ్ వేదికగా మంగళవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో జపాన్‌పై కాస్త కష్టపడి గెలిచిన టీమిండియా సెమీఫైనల్ చేరుకుంది. తద్వారా సలీమా టెటె సారథ్యంలోని భారత్ గ్రూప్ ఏ నుంచి సెమీస్ బెర్తు దక్కించుకుంది. న్యూజిలాండ్‌లోని ఆక్లాండ్‌లో జరుగుతున్న ఎఫ్ఐహెచ్ నేషన్స్ కప్‌లో భారత జట్టు గొప్పగా ఆడుతోంది. జపాన్ రూపంలో క్వార్టర్ ఫైనల్లో కఠినమైన ప్రత్యర్థికి ఎదురైనప్పటికీ 2-1తో టీమిండియా గెలుపొందింది. కెప్టెన్ సలీమా టీటె, ఫార్వార్డ్ లల్‌రెమ్సియామి చెరొక గోల్ చేయడంతో జపాన్‌కు ఓటమి తప్పలేదు. మూడో అర్ధ భాగంలో 33వ నిమిషంలో సలీమ, 49వ నిమిషంలో లల్‌రెస్మియామి గోల్ చేయడంతో భారత్ ఆధిక్యం 2-1కు చేరింది. తద్వారా ఆరు పాయింట్లో గ్రూప్ ఏ నుంచి అగ్రస్థానంలో నిలిచిన టీమిండియా సెమీస్ బెర్తు పట్టేసింది. అంతేకాదు వచ్చే ఏడాది జరుగబోయే ఎఫ్ఐహెచ్ ప్రో లీగ్‌కు టీమిండియా అర్హత సాధించింది.




# గొడవలు కాదు..
# ఆడాల్సింది ఆట!

**వైభవ్‌కు శ్రీలంక లెజెండ్ తెన్నెకూన్ సలహా**

శ్రీలంక వేదికగా జరుగుతున్న ఏ-జట్ల ముక్కోణపు సిరీస్ 2026లో ఒక ఆసక్తికర సంఘటన వెలుగులోకి వచ్చింది. సోమవారం దంబుల్లా వేదికగా భారత్ ఏ, శ్రీలంక ఏ జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. సూపర్ ఓవర్ వరకూ సాగిన ఈ మ్యాచులో తిలక్ వర్మ సారథ్యంలోని భారత జట్టు ఓడిపోయింది. అయితే మ్యాచ్ తర్వాత వైభవ్ సూర్యవంశీతో శ్రీలంక ఆటగాళ్లు గొడవకు దిగడం చర్చనీయాంశంగా మారింది. కానీ ఇదంతా జరిగిన తర్వాత స్టేడియంలో జరిగిన ఓ సంఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మ్యాచ్ ఓటమి తర్వాత టీమిండియా ఆటగాళ్లు తీవ్ర నిరాశతో డ్రెస్సింగ్ రూమ్‌లోకి వెళ్లారు. స్టేడియంలోని ప్రేక్షకులందరూ వెళ్ళిపోయారు. అయినప్పటికీ ఓ 70 ఏళ్ల మాజీ క్రికెటర్ మాత్రం టీమిండియా డ్రెస్సింగ్ రూమ్ బయటే ఎదురుచూశారు. ఆయనే శ్రీలంక క్రికెట్ దిగ్గజం అనుర తెన్నెకూన్ . శ్రీలంక క్రికెట్ చరిత్రలో తొలి వన్డే కెప్టెన్‌గా రికార్డు క్రియేట్ చేసిన అనుర తెన్నెకూన్.. 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ కోసం ఎదురుచూశారు. అతడితో మాట్లాడేందుకు ఓపిగ్గా నిలబడి ఉన్నారు. కాసేపటికే డ్రెస్సింగ్ రూమ్ నుంచి బయటకు వచ్చిన వైభవ్.. తెన్నెకూన్‌ను చూసి అక్కడే ఆగిపోయాడు. అనంతరం ఆయన పాదాలకు నమస్కరించాడు. నిజానికి మ్యాచ్ ముగిసిన కాసేపటికే ఆటగాళ్లు స్టేడియం నుంచి హోటల్‌కు వెళ్లిపోతారు. కానీ శ్రీలంక క్రికెటర్లతో వాగ్వాదం తర్వాత భారత క్రికెటర్లు డ్రెస్సింగ్ రూమ్‌లో కాస్త ఎక్కువ సమయం మాట్లాడుకున్నారు. వైభవ్ బయటకు రాగానే అనుర తెన్నెకూన్ అతనితో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా తెన్నెకూన్ విలేకరులతో మాట్లాడుతూ.. "వైభవ్ సూర్యవంశీ అసాధారణమైన టాలెంట్ గల ఆటగాడు. ఐపీఎల్ 2026లో అతను కొట్టిన సిక్సర్లు, ఫోర్లు చూసి నేను అతనికి పెద్ద అభిమానిని అయిపోయా" అని అన్నారు. 'మ్యాచ్ తర్వాత నేను అతడికి ఒకటే సలహా ఇచ్చా. బయట వినిపించే ఎలాంటి విమర్శలను, గొడవలను అస్సలు పట్టించుకోవద్దు. కేవలం నీ ఆటపైనే దృష్టి పెట్టు. ఈరోజు నీకు బ్యాటింగ్‌లో కలిసి రాలేదు.. కానీ ఇదంతా ఆటలో ఒక భాగమే. ప్రతిరోజూ మనం అనుకున్నట్లు ఆడలేం' అని వైభవ్‌కు శ్రీలంక మాజీ కెప్టెన్ సూచనలు చేశారు.







## న్యూజిలాండ్‌తో ఇరాన్ మ్యాచ్ డ్రా

ఫిఫా వరల్డ్‌కప్‌లో న్యూజిలాండ్, ఇరాన్ మధ్య జరిగిన మ్యాచ్ 2-2 గోల్స్ తేడాతో డ్రాగా ముగిసింది. రెండు సార్లు ఇరాన్ ఓటమి నుంచి తప్పించుకున్నది. కివీస్ ప్లేయర్ ఈ జస్ట్ తమ జట్టు తరపున రెండు గోల్స్ చేశాడు. తొలుత ఏడవ నిమిషంలో, ఆ తర్వాత 54 నిమిషంలో గోల్స్ చేశాడు. అయితే ఇరాన్ కూడా గట్టిగా కౌంటర్ ఇచ్చింది. కీలకమైన దశలో గోల్స్ చేసింది. 32, 64 నిమిషాలప్పుడు ఇరాన్ గోల్స్ చేసి కివీస్‌ను నిలువరించింది. అమెరికాతో యుద్ధం చేస్తున్న ఇరాన్.. వాస్తవానికి ఈ టోర్నీ ముందు అమెరికాలో ఆడేందుకు నిరాకరించింది. గ్రూప్ స్టేజ్‌లో మ్యాచ్‌లను మరో ప్రదేశానికి తరలించాలని పట్టుపట్టింది. కానీ ఫిఫా ఆ అభ్యర్థనను తిరస్కరించింది. తన శిక్షణ కేంద్రాని ఆరిజోనా నుంచి మెక్సికోలోని టిజునాకు మార్చుకున్నది. రెండు సార్లు వెనుకబడ్డ ఇరాన్ ఈ మ్యాచ్‌లో అద్భుతంగా రాణించింది. గ్రూప్ జీలో బెల్జియం, ఈజిప్ట్ మధ్య జరిగిన మ్యాచ్ 1-1 గోల్స్ తేడాతో డ్రా అయ్యింది.

## అమెరికాను వీడాలని ఆదేశించారు: ఇరాన్ కోచ్

ఫిఫా వరల్డ్ కప్ ఆరంభ పోరును డ్రా చేసుకున్న ఇరాన్‌కు ఊహించని పరిస్థితి ఎదురైంది. న్యూజిలాండ్‌పై అదరగొట్టిన ఉత్సాహంలో ఉన్న ఆ జట్టును తక్షణమే తమ దేశం వీడాలని అమెరికా అధికారులు ఆదేశించారు. దాంతో, 'ఇదెక్కడి అన్యాయం' అంటూ ఇరాన్ ఇరాన్ కోచ్ అమిర్ ఘలెనోయి నిరసన తెలిపాడు. ప్రస్తుతం జరుగుతున్న వరల్డ్‌కప్‌లో అణచివేతకు గురవుతున్న జట్టు తమదేనని అమిర్ వాపోయాడు. పశ్చిమాసియాలో ఇరాన్ - అమెరికా మధ్య శాంతి ఒప్పందం కుదిరినా.. మైదానంలో మాత్రం ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఫిఫా వరల్డ్‌కప్‌లో ఇరాన్‌ను లక్ష్యంగా చేసుకున్న అమెరికా అధికారులు వివాదానికి తెర తీశారు. న్యూజిలాండ్‌తో మ్యాచ్ డ్రా చేసుకున్న ఇరాన్ జట్టను వెంటనే తమ దేశం విడిచి వెళ్లాలని అమెరికా అధికారులు ఆదేశించారు. అయితే.. ఈ నిర్ణయంపై ఇరాన్ కోచ్ అమిర్ ఘలెనోయి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాడు. మ్యాచ్ ఉన్నప్పుడు మాత్రమే అమెరికాలో అడుగుపెట్టి.. గేమ్ అవ్వగానే తిరిగి వెళ్లాలని అధికారులు చెప్పడం అన్యాయమని ఆయన పేర్కొన్నాడు. 'ఈ రోజు మ్యాచ్ అనంతరం మమ్మల్ని అమెరికా విడిచి వెళ్లాలని ఆదేశించారు. లాస్ ఎంజెల్స్‌లో ఉండి కాస్త రిలాక్స్ అవుదామనుకుంటే మమ్మల్ని మెక్సికోలోని మా శిక్షణ కేంద్రం టిజువానాకు వెళ్లాలని చెప్పారు. మాకు టోర్నీ ఆసాంతం ఎన్నో అవరోధాలు ఎదురవుతున్నాయి. మొదట్లో వీసా, ప్రయాణ ఇబ్బందులు ఎదుర్కొన్నాం. సహాయక సిబ్బంది, ఫుట్‌బాల్ సమాఖ్య అధ్యక్షుడు మహెది తాజ్ లేకుండానే మేము లాస్ ఏంజెల్స్ వచ్చాం.



ఈవార్తలు
# ప్రజావాణి
బుధవారం 17-6-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు


నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

## స్పేస్ ఎక్స్ ఐపీవో: ప్రపంచ మార్కెట్లకు కొత్త ఒరవడి

ప్రపంచ పెట్టుబడి మార్కెట్ల చరిత్రలో కొన్ని సంఘటనలు యుగమార్పుకు సంకేతాలుగా నిలుస్తాయి. ఇంటర్నెట్ కంపెనీల ఐపీవోలు ఒక దశను మార్చితే, ఇప్పుడు అంతరిక్ష రంగంలోని ప్రైవేట్ సంస్థల ఎదుగుదల మరో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతోంది. ప్రపంచంలోనే అత్యంత విలువైన ప్రైవేట్ కంపెనీలలో ఒకటైన స్పేస్ ఎక్స్ భవిష్యత్తులో ఐపీవో దిశగా అడుగులు వేస్తుందనే చర్చలు పెట్టుబడిదారులు, ఆర్థిక నిపుణులు, టెక్నాలజీ రంగాన్ని ఉత్సాహపరుస్తున్నాయి. ఇది కేవలం ఒక కంపెనీ షేర్ల విక్రయం మాత్రమే కాదు; భవిష్యత్తు ఆర్థిక వ్యవస్థలో అంతరిక్ష పరిశ్రమకు దక్కబోయే ప్రాధాన్యానికి ప్రతీక. ఒకప్పుడు ప్రభుత్వాల ఆధీనంలో ఉన్న అంతరిక్ష పరిశోధన ఇప్పుడు ప్రైవేట్ రంగం చేతుల్లోకి వేగంగా మారుతోంది. రాకెట్ ప్రయోగాలు, ఉపగ్రహ సేవలు, అంతరిక్ష కమ్యూనికేషన్, భూమి పరిశీలన, అంతరిక్ష పర్యాటకం వంటి రంగాల్లో భారీ వ్యాపార అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో స్పేస్ ఎక్స్ వంటి సంస్థ మార్కెట్లోకి వస్తే పెట్టుబడిదారుల దృష్టి సంప్రదాయ రంగాల నుంచి హైటెక్, దీర్ఘకాలిక ఆవిష్కరణల వైపు మరింత మళ్లే అవకాశం ఉంది. స్పేస్ ఎక్స్ ఐపీవో మరో ముఖ్యమైన సందేశాన్ని కూడా ఇస్తుంది. అది "అధిక రిస్క్ – అధిక సాంకేతికత – దీర్ఘకాలిక పెట్టుబడి" అనే కొత్త పెట్టుబడి తత్వానికి బలం చేకూర్చవచ్చు. గతంలో లాభాల కంటే ఆలోచనలు, పరిశోధన, భవిష్యత్తు మార్కెట్ సామర్థ్యాల ఆధారంగా కంపెనీలకు విలువ కట్టడం టెక్నాలజీ రంగంలో కనిపించింది. ఇప్పుడు అదే ధోరణి అంతరిక్ష రంగంలో మరింత స్పష్టంగా కనిపించే అవకాశం ఉంది. అయితే ఈ ఉత్సాహం మధ్య జాగ్రత్త కూడా అవసరం. భారీ అంచనాలపై ఆధారపడిన విలువలు ఎప్పుడూ వాస్తవ ఆర్థిక ఫలితాలను ప్రతిబింబించకపోవచ్చు. సాంకేతిక వైఫల్యాలు, నియంత్రణ పరిమితులు, భారీ మూలధన అవసరాలు, అంతర్జాతీయ పోటీ వంటి అంశాలు ఈ రంగంలో పెట్టుబడులను ప్రభావితం చేయగలవు. అందువల్ల కేవలం బ్రాండ్ పేరు చూసి పెట్టుబడులు పెట్టడం కంటే వ్యాపార నమూనా, ఆదాయ వనరులు, దీర్ఘకాలిక స్థిరత్వాన్ని పరిశీలించడం అవసరం. భారత్‌కు కూడా ఇందులో ఒక స్పష్టమైన పాఠం ఉంది. దేశంలో అంతరిక్ష స్టార్టప్‌లు, ప్రైవేట్ ప్రయోగ సేవలు, ఉపగ్రహ తయారీ, డేటా ఆధారిత సేవలకు అనుకూల వాతావరణాన్ని మరింత బలోపేతం చేయాలి. పరిశోధన, మూలధనం, నియంత్రణలో పారదర్శకత, పెట్టుబడిదారులకు ప్రోత్సాహం కల్పిస్తే భారతీయ కంపెనీలు కూడా ప్రపంచ పెట్టుబడి మార్కెట్లలో తమ ముద్ర వేయగలవు. మొత్తానికి, స్పేస్ ఎక్స్ ఐపీవో చుట్టూ నెలకొన్న ఆసక్తి ఒక కంపెనీ విజయగాథ కంటే ఎక్కువ. అది భూమి పరిమితులను దాటి అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ వైపు ప్రపంచ పెట్టుబడి మార్కెట్లు అడుగులు వేస్తున్న సంకేతం. భవిష్యత్తులో పెట్టుబడి అంటే కేవలం ఫ్యాక్టరీలు, బ్యాంకులు, ఐటీ సంస్థలు మాత్రమే కాదు; రాకెట్లు, ఉపగ్రహాలు, అంతరిక్ష మౌలిక వసతులు కూడా సమాన ప్రాధాన్యం పొందే రోజులు దగ్గరపడుతున్నాయి. అలాంటి మార్పులను ముందుగానే అర్థం చేసుకుని సిద్ధమయ్యే దేశాలు, పెట్టుబడిదారులే రేపటి ఆర్థిక పోటీలో ముందంజలో నిలుస్తారు.

## ఉద్యోగాలతో సమాధానం చెప్పాలి

ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక స్వేచ్ఛ. ముఖ్యంగా ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి సిద్ధమై, ప్రభుత్వ నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువత గళమెత్తితే, వారి ఆవేదనను వినడం ప్రభుత్వ బాధ్యత. అలాంటి సందర్భంలో దిల్‌సుఖ్‌నగర్‌లో నిరసన చేపట్టిన నిరుద్యోగులపై లాఠీచార్జి జరిగినట్లు వెలువడిన వార్తలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగులకు న్యాయం, యువతకు అవకాశాలు వంటి హామీలను విస్తృతంగా ఇచ్చింది.



అధికారంలోకి వచ్చిన తర్వాత అదే యువత ప్రశ్నిస్తే, సమాధానంగా సంభాషణకు బదులుగా బలప్రయోగం కనిపించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి అనుకూలంగా కనిపించదు. ప్రజల అసంతృప్తిని లాఠీలతో అణచివేయడం తాత్కాలికంగా రోడ్లను ఖాళీ చేయవచ్చు గానీ, సమస్యను మాత్రం పరిష్కరించదు. నిరుద్యోగం అనేది ఆర్థిక సమస్య మాత్రమే కాదు; అది కుటుంబాల ఆశలు, యువత భవిష్యత్తు, సమాజ స్థిరత్వానికి సంబంధించిన అంశం. పరీక్షలకు సిద్ధమవుతూ సంవత్సరాలు గడిపిన అభ్యర్థులు నోటిఫికేషన్లు, నియామకాలు, స్పష్టమైన కార్యాచరణ కోరడం అసహజం కాదు. వారి డిమాండ్లతో ప్రభుత్వం ఏకీభవించకపోయినా, వారితో చర్చలు జరపడం, స్పష్టమైన వివరణ ఇవ్వడం, కార్యాచరణ ప్రణాళిక ప్రకటించడం వంటి మార్గాలు ప్రజాస్వామ్య ప్రభుత్వానికి మరింత సముచితం. చరిత్ర చెబుతున్న పాఠం ఒక్కటే– నిరుద్యోగ యువతలో పేరుకుపోయిన అసంతృప్తిని నిర్లక్ష్యం చేసిన ప్రభుత్వాలు తీవ్రమైన రాజకీయ మూల్యం చెల్లించుకున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి. యువత విశ్వాసాన్ని కోల్పోతే, అది కేవలం ఒక నిరసనతో ఆగిపోదు; ఎన్నికల తీర్పులోనూ ప్రతిఫలించవచ్చు. ప్రభుత్వం తనపై వచ్చిన విమర్శలను శత్రుత్వంగా కాకుండా హెచ్చరికగా స్వీకరించాలి. నిరుద్యోగులపై కేసులు, అరెస్టులు, లాఠీచార్జిల కంటే పారదర్శక నియామకాలు, ఖాళీల భర్తీ, సమయపాలనతో కూడిన ఉద్యోగ క్యాలెండర్ ప్రకటించడం ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతుంది. యువత చేతిలో ఉద్యోగ నియామక పత్రం ఉంటే వీధుల్లో నిరసన ప్లకార్డులు ఉండవు. చివరగా, ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ బలం పోలీసు లాఠీలలో కాదు; ప్రజల నమ్మకంలో ఉంటుంది. నిరుద్యోగుల ఆవేదనను అణచివేయడం కంటే, వారి ఆకాంక్షలకు న్యాయం చేయడమే ఏ బాధ్యతాయుత ప్రభుత్వానికైనా నిజమైన పరీక్ష.



**శ్రీకాంత్ చుక్కల, నిజామాబాద్**



## అవినీతి పునాదులు.. అధికారుల మేడలు

ప్రభుత్వ వ్యవస్థపై ప్రజల విశ్వాసం ఉండాలంటే నిజాయితీ, పారదర్శకత, జవాబుదారీతనం తప్పనిసరి. కానీ తెలంగాణలో ఇటీవలి కాలంలో వెలుగులోకి వస్తున్న అవినీతి వ్యవహారాలు చూస్తే పరిస్థితి ఆందోళనకరంగా కనిపిస్తోంది. వరుసగా జరుగుతున్న దాడుల్లో భారీ స్థాయిలో అక్రమ ఆస్తులు, నగదు, బంగారం, విలాసవంతమైన ఆస్తులు బయటపడుతున్నాయనే వార్తలు ప్రజల్లో తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తిస్తున్నాయి. ఆందోళనకరమైన విషయం ఏమిటంటే, అవినీతి ఆరోపణలు ఇప్పుడు కొందరు వ్యక్తులకే పరిమితం కాకుండా వ్యవస్థలోని వివిధ స్థాయిల వరకు విస్తరించాయనే అభిప్రాయం బలపడుతోంది.

చిన్న స్థాయి ఉద్యోగి నుంచి ఉన్నతాధికారి వరకు అక్రమ సంపాదన ఆరోపణలు వినిపించడం ప్రజా పరిపాలన ప్రతిష్ఠను దెబ్బతీస్తోంది. ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లే సాధారణ పౌరుడు తన పని నిబంధనల ప్రకారం జరుగుతుందా, లేక లంచం చెల్లించాల్సి వస్తుందా అనే అనుమానంతో అడుగు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడకూడదు. అవినీతి వల్ల నష్టపోయేది ప్రభుత్వ ఖజానా మాత్రమే కాదు. ప్రతి లంచం వెనుక ఒక పేద కుటుంబం ఆలస్యమైన సేవ, ఒక రైతు పెండింగ్‌లో పడిన ఫైలు, ఒక విద్యార్థి నిలిచిపోయిన ధ్రువీకరణ పత్రం, ఒక చిన్న వ్యాపారవేత్త ఎదుర్కొన్న అనవసర ఇబ్బంది దాగి ఉంటుంది. ప్రజల హక్కులను కొందరి వ్యక్తిగత సంపదగా మార్చే ప్రక్రియే అవినీతి. దర్యాప్తు సంస్థలు తరచూ దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నప్పటికీ, అలాంటి చర్యలు మాత్రమే సరిపోవు. చట్టపరమైన ప్రక్రియ వేగంగా పూర్తవడం, నేరం రుజువైతే కఠిన శిక్షలు అమలు కావడం, అక్రమంగా సంపాదించిన ఆస్తులను స్వాధీనం చేసుకోవడం వంటి చర్యలు కూడా సమానంగా అవసరం. శిక్ష పడే అవకాశం తక్కువగా ఉందనే భావన ఏర్పడితే, అవినీతి నిరోధక వ్యవస్థల ప్రభావం తగ్గిపోతుంది. ప్రభుత్వం కూడా దాడులతో సరిపెట్టకుండా, అవినీతికి అవకాశాలు తగ్గించే విధాన సంస్కరణలపై దృష్టి పెట్టాలి. సేవల డిజిటలీకరణ, ఫైళ్ల ఆన్‌లైన్ ట్రాకింగ్, నిర్ణయ ప్రక్రియలో పారదర్శకత, అధికారుల ఆస్తుల క్రమానుగత పరిశీలన, ఫిర్యాదు దారులకు రక్షణ వంటి చర్యలు అవినీతిని తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ప్రజల పన్నులతో నడిచే ప్రభుత్వ వ్యవస్థలో ఉద్యోగం అనేది సంపద కూడబెట్టుకునే అవకాశం కాదు, ప్రజాసేవ చేసే బాధ్యత. ఆ బాధ్యతను విస్మరించి అక్రమ మార్గాల్లో సంపాదనకు పాల్పడితే, అది వ్యక్తిగత తప్పిదాన్ని మించి ప్రజాస్వామ్యంపై దెబ్బగా మారుతుంది. తెలంగాణ అభివృద్ధి భవనాలు, రహదారులు, పెట్టుబడులతో మాత్రమే కొలవడం కాదు.. ప్రభుత్వ కార్యాలయాల్లో నిజాయితీ, ప్రజలకు న్యాయం, అవినీతిపై రాజీలేని వైఖరి కూడా అంతే ముఖ్యమైనవి. లంచాలతో కట్టిన మేడలు ఎంత ఎత్తుకు ఎదిగినా, అవి చివరికి ప్రజల నమ్మకాన్ని కూల్చే శిథిలాలుగానే మిగిలిపోతాయి. అవినీతిపై నిరంతర నిఘా, సమర్థవంత దర్యాప్తు, వేగవంతమైన న్యాయ ప్రక్రియ, రాజకీయ సంకల్పం కలిసివచ్చినప్పుడే ప్రజలకు జవాబుదారీ పరిపాలన అందుబాటులోకి వస్తుంది.

**– బీ.విశ్వక్‌సేన, హైదరాబాద్**


రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811


This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.